డిసెంబర్-2023

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

B.A.,B.L.,


**చందా వివరాలు :**

**సంవత్సర చందా రూ. 350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-


**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లౌపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726


**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| జప్పత్వనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 06 |
| డ్యాన్స్ బేబి డ్యాన్స్ | కె.ఇ. రాజేంద్ర | 08 |
| నీవు విత్తినదే కోస్తావు | హన్నాకృప డెస్క్ | 09 |
| క్రిస్మస్-యేసు ఎక్కడ? | హన్నాకృప డెస్క్ | 10 |
| మధ్యకాలము | హన్నాకృప డెస్క్ | 11 |
| యోసేపు | హన్నాకృప డెస్క్ | 12 |
| పరమ వైద్యుడు | సాక్ష్యము | 14 |
| మహాదార్శనికురాలు | డా॥ఫ్రెడ్రిక్ చిక్కాల | 16 |
| కృపాదానం | కొడవటికంటి | 19 |
| మరియ | స్త్రీల కొరకు | 20 |
| సమయము | చిన్నపిల్లల పేజి | 22 |
| పరిశుద్ధగ్రంథపరిశోధనా పట్టిక-17 | | 24 |





సీరియల్ నంబరు

# సంపాదకీయం....

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామము క్రిస్మస్ శుభాకాంక్షలు

'హన్నాకృప' మాస పత్రికను ఆదరిస్తున్నందుకు మీకు మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. దేవుని కృపలో మరొక క్రిస్మస్ వరకు దేవుడు మనలను కాపాడి మరో నూతన సంవత్సరాన్ని కూడా చూడ్డానికి కృప అను గ్రహించాడు. మీరు, మీ పిల్లలు అంతా సంతోషంగా ఉన్నారని, ఉంటారని విశ్వసిస్తున్నాను. మాపై చూపుతున్న ఆదరాభిమానాలకు మేము ఎంతో సంతోషిస్తున్నాము.

క్రిస్మస్ సర్వమానవాళికి పండుగ దినము. కులాలకు, మతాలకు అతీతమైనది. ఎందుకంటే ఆయన జన్మించిన సమయములో దేవదూతలు "సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమయు, ఆయనకిష్టులైన మనుష్యులకు భూమి మీద సమాధానము కలుగును గాక" అని దేవదూతలు స్తుతించారు. గొర్రెల కాపరులు దేవదూత ద్వారా "ప్రజలందరికీ కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియ జేయుచున్నాను. దానికిదే మీకానవాలు. ఒక శిశువు పొత్తిగుడ్డలతో పరుండియుండుట మీరు చూచెదరు" అన్న కబురందుకొని వెళ్ళి ఆ శిశువును దర్శించారు. తాము కూడా దేవునికి స్తోత్రము చేయుచూ వెళ్ళిపోయారు. ఎప్పటినుండో నిరీక్షిస్తూ, ఎక్కడో దూరాన్నుండి బయలుదేరి ఒంటెల మీద బంగారు, సాంబ్రాణి, బోళము వంటి విలువైన వస్తువులతో బయలుదేరి నక్షత్రము దారిచూపగా బాలుడైన యేసుక్రీస్తును కనుగొని ఆయనను పూజించారు తూర్పు దేశపు జ్ఞానులు. అందుకే ఇది సర్వమానవాళి పండుగ. మీరు మీ ఇరుగు పొరుగు వారితో, క్రైస్తవేతరులతో కలసి ఈ సంతోషాన్ని పంచుకోవలసినదిగా కోరుతున్నాను.

దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరుచున్నాను. మీరు ఫోన్‌పే లేదా గూగుల్‌పే ద్వారా చందా పంపాలనుకుంటే పత్రికలో 5వ పేజీలో ముద్రించబడిన క్యూఆర్ కోడుని ఫోన్‌పే ద్వారా స్కాన్ చేసి పంపవచ్చును. మీరు ఫోన్‌పే లేదా గూగుల్‌పే ద్వారా చందా కట్టినట్లయితే దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

–కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 1095729434O**

సీరియల్

# జఫ్నత్పనేహు

19

**(యోసేపు జీవిత చరిత్ర)**

**- కొడవటికంటి**

ఇప్పుడు మొదటిసారిగా అమ్మగారి గది ముందు నిలబడి బానిసల వంక చూశాడు. వారిలో ఒక బానిస లోపలికి వెళ్లి తన రాక యజమానురాలికి తెలియ పరిచాడు. అతను బయటకు వచ్చి తనను లోపలికి పంపి తలుపు తన వెనుక మూసివేసాడు. "ఆమె ఒక్కతేనా ఈ గదిలో, ఈ గది ఇంత చల్లగా ఎట్లా చేయ బడుతుంది?" అనుకున్నాడు.

గదిలో రెండు మంచాలవంటి ఆసనాలు ఉన్నాయి. ఆ ఆసనాల పాదాల దగ్గర పాదపీఠలు. ఆ ప్రక్కనే ఒక ఇనుప పీఠమునకు రెండు నెమలి పింఛములతో చేసిన విసనకర్రలు. వాటికున్న పెద్ద కర్రలకు బంగారు రేకు తొడిగారు. రెండు నిలువుటద్దాలు వాటి ముందు రకరకాల సౌందర్య నూనెలు. యోసేపు అట్లానే చూస్తూ, తను ఉన్నది తన యజమానురాలి గది అని మర్చిపోయాడు. తన చూపు తన బాధ్యతను మరిపింప చేసింది. తన ఎడమ ప్రక్కన దాదాపు ఇరవై జతల పాదరక్షలు. అవి "తన యజమానురాలివా? లేక ఎవరైనా ఒక చిన్న బాలికవా?" అనేటంత చిన్నవి. అన్నీ విదేశాల నుండి తెప్పించినవే! "అసలు వాటిని ఒక్కసారైనా తొడిగిందా?" అనిపించింది. ఇంతలో గదిలో తీయని వాసన ప్రవేశిస్తుంది. అది సాంబ్రాణి లాగ అనిపించినా, కాదు తన ఊహకు మించిన వాసన. ఆ వాసన వెనకాలే ఇద్దరు బానిసలు, మధ్యలో తన యజమానురాలు వచ్చి ఒక సోఫాలో కూర్చుని యోసేపు వైపుగా చూసింది. 'ఎంత లావణ్యం' అనుకున్నాడు. ఎంత హూందాగా ఉంది. ఇటువంటి గంభీరమైన స్త్రీ వద్ద పనిచేయడం తన భాగ్యం అనుకున్నాడు. వంగి నమస్కారం చేసాడు. తలవంచి నమస్కరించాడు. 'ఎంత మార్పు! తన వస్త్రములు తన ఈ గర్వానికి కారణమా?' అనుకున్నాడు. తను పూర్తిగా వంగి నమస్కరించలేదు అనుకొని మరలా పూర్తిగా నమస్కరించాడు. ఇప్పుడు ఆమె తన తప్పు తను దిద్దుకోవటం గమనించి కొద్దిగా నవ్వింది. ఆమె నవ్వినట్లు కనిపిస్తేనే ఇంత అందంగా ఉంది అనుకొని, ఈ ఆలోచన కలిగినందుకు నొచ్చుకున్నాడు. తన మనోభావాలను చదువుతున్నట్లుగా ఆమె తనని చూస్తున్నది. ఈ రోజే మొదటిసారిగా తనని చూస్తున్నట్లుగా చూస్తుంది.

"ఏమి ఇలా వచ్చావు?" అని అడిగింది. బానిసలు తమ చేతుల్లోకి విసనకర్రలు తీసుకొని ఆమెకి విసరబోతే ఆమె వారించింది. వారిద్దరు గదిలో నుంచి వెళ్ళిపోయారు. ఆ బానిస పిల్లలు ఇద్దరు పదిహేను సంవత్సరాలకు మించి ఉండరు. వారి అందము వారి బానిసత్వాన్ని మింగివేసింది.

"తమరు పిలిచారంట!" అన్నాడు యోసేపు.

"మీరు అక్షాపును కలువ లేదా? అక్షాపు చాలా విద్యావంతుడు. మీకు ప్రతిరోజు ఒక గంట పారసీకం, సిరియా, ఐగుప్తు భాషలతో పాటు గణితం కూడా నేర్పుతారు. ఇక్కడి మీ బాధ్యతలు కూడా తనే నేర్పుతారు. మీరు ఇక ఏదైనా స్వతంత్రించి చేయదలచుకుంటే, అంటే ఏదైన ఈ యింటి పద్ధతులు మార్చాలనుకుంటే అనుమతి అవసరము లేదని మీ యజమాని మీకు చెప్పమన్నారు. మంచి చెయ్యటం మీకు వచ్చునని ఆయన నమ్మకం. మీరు ఎప్పుడైనా మమ్ములను కలవాలి అనుకుంటే, మీ బానిసలతో అవసరం లేకుండానే మా యొద్దకు రావచ్చును" అని ఆమె అద్దం దగ్గర నిలబడి తనను తాను చూచుకున్నంతసేపు యోసేపును చూచి చిన్నగా నవ్వి, "మీరు వెళ్ళ వచ్చును" అంది. యోసేపు వంగి నమస్కారం చేసి బయటకు వచ్చాడు.

మనసంతా ఎంతో సంతోషంగా ఉంది. దేవుడు తన యజమానురాలికి తన యెడల దయ పుట్టించినందుకు, ఆయనకు వందనములు అనుకున్నాడు. అక్షాపు దగ్గరకు

వెళ్ళాలనుకుంటూ నడిచాడు. మెట్లు దిగి ఆఖరు అంతస్తుకు వచ్చిన తర్వాత ఎడమ ప్రక్కకు తిరిగితే, అక్షాపు వెళ్ళాడని చెప్పారు. "అక్షాపు వస్తే తోటలోకి రమ్మనమని" అక్కడున్న బానిసకు చెప్పాడు. యోసేపు ఒక్కొక్క చెట్టు గమనిస్తూ, తోటలోనికి నడిచాడు. అక్షాపు రావటం గమనించాడు.

"సాయంకాలం కొన్ని వస్త్రాలు కొనుగోలు చెయ్యాలని అనుకుంటున్నాను. నాలుగు గంటలకు వీలవుతుందా?" అని అడిగాడు యోసేపు.

అక్షాపు తలవూపి "షెరార రథం సిద్ధం చెయ్యమని చెపుతాను" అంటూ నడిచాడు.

తను ఈ ఇంట్లోకి వచ్చిన తర్వాత ఒక్కసారైనా ప్రహరీ ద్వారం దాటి వెళ్ళలేదు. అసలు బయటకు కూడా వెళ్ళాలని పించలేదు. ఈ తోటలోనే ఎన్ని పనులతో గడిపాడో, ఎన్నో.. తనకే తెలియదు. అంతగా ఈ తోటపనిలో మునిగిపోయాడు. తను పోతీఫరు ఇంటికి మొదటిసారి ప్రవేశించింది రాత్రి జామున. అప్పుడు అమ్మబడిన బానిస. ఇప్పుడు కూడా తను బానిసే! కాని తన యజమానికి తన విషయంలోగల అభిమానం తను బానిస అనే అభిప్రాయం కలుగనివ్వడం లేదు. ఎంతైనా తను విమోచించబడిన వాడు కాదు కదా! తనకు, పని వారికివలె జీతము లేదు కనుక తనను విమోచించే వారు వేరొకరు రావాలి. తనను ఎవరు ఈ బానిసత్వం నుండి విమోచిస్తారు? తనను ఎరిగినవాడు ఈ దేశంలో పోతీఫరు మాత్రమే. పోతీఫరు తనని కొనుక్కున్నాడు. కనుక తనకు స్వతంత్రం ఇచ్చినా, తను పోతీఫరు ప్రేమకు బానిస. అలా కాకుండా తనను ఉచితంగా ప్రేమించి, స్వార్థం కొంచెం కూడా లేకుండా విమోచించేవారు ఎవరు? యోసేపు ఆలోచిస్తున్నాడు. రథం ముందుకు కదులుతున్నది.

ఆ రోజు రాత్రి ఎనిమిది గంటల వరకు అక్షాపు – పోతీఫరుకు, అతని ఇంటికి, పొలానికి, అనేక రకాలైన సామానులు, భోజన పదార్థములు, వస్త్రాలు, చివరికి మాంసం సరఫరా చేసే ఖాతా కొట్లన్నిటిని చూపించాడు. వారందరికి పోతీఫరుగారి యొక్క క్రొత్త గృహనిర్వాహకునిగా యోసేపును పరిచయం చేసాడు. పోతీఫరు అంటే ఆ దేశమంతట మాత్రమేకాక చిన్నచిన్న వర్తకులలో కూడా చాలా అభిమానం, గౌరవం ఉన్నందువలన యోసేపుకు కూడా చాలా గౌరవం, మర్యాద చూపారు. ఆ రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత అక్షాపును దగ్గర ఉంచుకుని దాదాపు రాత్రంతా జమా లెక్కలు, ఆ సంస్థానము యొక్క పనివారి జీతాలు, పోతీఫరు యొక్క స్థిరాస్థులు, అవి కౌలు చేస్తున్న వారి చిరునామాలు అన్నీ చూచాడు. సాధారణంగా పాత గృహనిర్వాహకుడు ఉంటే అతను క్రొత్త గృహనిర్వాహకునికి విషయం విశదీకరించటం తేలికే. కాని అకస్మికంగా చని పోవటం వలనను చాలాకాలంగా గృహనిర్వాహకుడు లేకుం డుట వలనను ఇప్పుడు మళ్లీ అన్నీ సరిచేసుకోవడానికి యోసేపు చాలా కష్టపడవలసి వచ్చింది. ఇంకా నయం! అక్షాపును దేవుడు తన కొరకు ఇక్కడుంచాడు అనుకున్నాడు.

అక్షాపు, యోసేపు కలిసి ఈ లెక్కలన్నీ చూసిన తర్వాత చాలా అవకతవకలు కనిపించాయి. చాలా నష్టం జరుగుతు న్నట్లుగా గుర్తించారు. అక్షాపు తన అనుభవాలను కలిపి, అక్కడ వ్రాయబడిన లెక్కలు జోడించి, వారిద్దరూ కలసి దిద్దుబాటు చేయవలసిన అనేక విషయాలు పట్టీ వ్రాసారు.

ఇవన్నీ సరిచేస్తే తన యజమానునికి ప్రతి ఏడు పది తలాంతుల ఆదాయం కలిసి వస్తుంది అనుకున్నాడు. అందువలన మరియొక నెల గడిచే సరికి పోతీఫరుకు ఆశ్చర్యం కలిగించే సన్నివేశాలు తన ఇంటిలో కనిపించాయి. పోతీఫరు నివసిస్తున్నది మూడంతస్తుల భవనం. తను నివసించే పై అంతస్తులో వంట భోజనాలు. చివరి అంతస్తులో తను. తన గదిలో రాజవస్త్రాలు తీసివేసిన తర్వాత భోజనానికి క్రిందకు వెళ్ళవలసి వచ్చినందున చాలాసార్లు పాలు త్రాగి, కొన్ని పండ్లు తిని నిద్రపోయేవాడు. కానీ ఇప్పుడు తను తన గది లోనికి ఎంత రాత్రి జామున వచ్చినా వేడిగా భోజన పదార్థాలన్నీ బానిసలు తన గదిలోనే వడ్డిస్తున్నారు. పగలు మాత్రం తను భోజనాల గదికి వెళ్ళాలి. ఈ రకమైన మార్పులు ఎన్నో జరిగాయి.

బానిసలకు మంచి వస్త్రాలు సరఫరా చేస్తూ, వారు

ఏమాత్రం సోమరులుగా ఉండటానికి వీలు లేకుండా రకరకాల వ్యాపకాలు వారి కొరకు కల్పించబడ్డాయి. అయినప్పటికి బానిసలంతా చాలా సంతోషించారు. మంచి ఆహారం, మంచి నిద్ర తగిన సమయంలో ఇవ్వటం వలన వారు వారికప్పగించబడిన ఏ పని అయినా ఉత్సాహంగా చేసేవారు. యోసేపు పనివారికి, బానిసలకి పూర్తి సహకారం, ప్రేమ ఇచ్చినందువల్ల 'మేము బానిసలం' అనే అభిప్రాయం ఎవరిలోను కనిపించలేదు.

మూడవ సంవత్సరంలో పొలాల వద్దకు తరచుగా వెళ్తుండేవాడు. పొలాలు చాలా దూరంలో ఉన్నా, పొలాలలో ధాన్యం మాత్రమే కాక పండ్లతోటలు వేయించాడు. వృద్ధులైన కొందరు బానిసలను తోటలోనే స్వతంత్రంగా పనిచేస్తూ కాపలా కొరకు వారి కాపురాలు అక్కడనే ఉంచాడు. నాలుగవ సంవత్సరంలో పోతీఫరు ఇంటికి విపరీతమైన లాభాలు వచ్చాయి. యోసేపు కొన్ని పశువుల మందలను కూడా పెంచాలని అనుకున్నాడు. కాని పశువుల కాపరులను ఐగుప్తీయులు చాలా తక్కువ జాతి వారిగా చూస్తారు. అందువలన ఆ ఉద్దేశం మానుకున్నాడు.

పోతీఫరుకు ఇప్పుడు రాజు సన్నిధిలో మంచి అభిమానం పెరిగింది. ఫరో వారానికి ఒక్కసారైనా పోతీఫరును పిలిపించి దేశం విషయం మాత్రమేకాక ఫరో ఇంటి విషయాలు కూడా మాట్లాడుతుండేవాడు. పోతీఫరు భార్య కూడా ఫరో ఇంటికి వెళ్ళి మహారాణితో సన్నిహితంగా మసలడం వలన దేశమంతట పోతీఫరు పేరు తెలియని వారు లేరు.

ఇప్పటికి పోతీఫరు ఇంటికి యోసేపు వచ్చి ఏడు సంవత్సరాలు గడిచిపోయాయి. యోసేపు కొంచెం పొడుగు పెరిగాడు. గడ్డం కూడా బాగా పెరిగింది. మంచి మీసకట్టు ఏర్పడింది. చాలామంది పరదేశులు ఆ ఇంటి యజమాని యోసేపే! అనుకునేవారు. పోతీఫరుకు ఇంతకు ముందు రాజదేహ సంరక్షక సేనాధిపతి పదవి. ఇప్పుడు రాజు ఖైదీలను ఉంచే చెరసాల యొక్క బాధ్యత కూడా అప్పగించి రాబడి ఎక్కువ చేసాడు. యోసేపు కొలువులో చేరిన ఏడు సంవత్సరాలలో యోసేపును పోతీఫరు కాని, అతని భార్య కాని చాలా తక్కువగా కలుసుకొనేవారు. ఎప్పుడైనా యోసేపుతో మాట్లాడాలంటే పొలము వద్దనో, తోటల వద్దనో ఉన్నాడని కబురు వచ్చేది. యోసేపును చూడాలని అనుకొనే ఆలోచన ఎప్పుడైనా అతని గొప్పతనం గురించి విన్నప్పుడే! మిగిలిన సమయాలలో ఎవరి పనుల్లో వారు విశ్రాంతి లేకుండా ఉండేవారు. ఇంతకు ముందు అంటే గృహ నిర్వాహకునిగా తన జీవిత ప్రారంభంలో ఏది కొనాలన్నా, అమ్మాలన్నా పోతీఫరు యొక్క సంతకం అవసరమయ్యేది. ఇప్పటికి మూడు సంవత్సరాల నుండి తన సంతకం లేకుండా యోసేపు సంతకంతోనే అన్ని కార్యక్రమాలు నెరవేర్చబడేటట్లు ఏర్పాట్లు చేసాడు.

తను ఆహారం తినుట తప్ప తనకేమి ఉందో, ఏమి లేదో ఆలోచించడం మాని వేశాడు. పోతీఫరు సంస్థానంలో ఉండే వారందరికి తెలుసు యోసేపు అడుగు పెట్టిన ప్రతి స్థలం ఆశీర్వదించబడుతుందని. **(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**
Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

# నా చిత్తానుసారుడు



(దావీదు జీవిత చరిత్ర)

– కొడవటికంటి

ద్రాక్షారసం ఒక పెద్ద పాత్రలో తీసుకొని వచ్చి ప్రక్కన నిలుచున్నది. యోనాతాను ఆమెను గమనించినా మౌనంగా ఉన్నాడు. ఆమె ఆ పాత్ర ప్రక్కన ఉంచి నిదానంగా శిరస్సున ఉన్న కిరీటం తీసి ప్రక్కన ఉంచింది. వంగి కూర్చొని పాద రక్షలు తీసింది. ఇప్పుడు యోనాతానుకు కొంచెం సేదదీరి నట్లుగా అనిపించింది.

ఆమె పరిచారిక వైపు చూసింది. పరిచారిక విసనకర్ర తీసుకొని వచ్చి ఊప సాగింది. యోనాతాను వెనుక వైపు నుండి చిన్నగా గాలి వీచుతున్నది.

అక్సా పాత్ర తీసి దగ్గరగా ఉంచింది. యోనాతాను ఆమె మొఖంలోనికి నిదానంగా చూచాడు. పాత్ర తీసుకొని సగం త్రాగి ఆమె చేతికిచ్చాడు. ఆమె అది తీసుకొని మౌనంగా నిలుచున్నది. మరలా పాత్ర చేతికి ఇచ్చింది. అది కూడా తాగిన తర్వాత అతను మామూలుగా అయిపోయాడు.

"అక్సా" అన్నాడు.

ఆమె ఇంక కొంచెం దగ్గరగా వచ్చింది. తన చేతిలోని పాత్ర ప్రక్కన ఉంచి అక్సా చేయి పట్టుకున్నాడు కూర్చో అన్నట్లుగా. ఆమె ప్రక్కన కూర్చుంది. తనలో చోటు చేసుకున్న అసహాయత ఆమె తన ప్రక్కన కూర్చున్నప్పుడు తొలగిపోయినట్లు అనిపించింది.

ఆమె మొఖంలోకి చూసి "దావీదు, నేను మొన్న ప్రమాణపూర్వకంగా నిబంధన చేసుకున్నాం" అని "మెఫిబో షెతు ఏమి చేస్తున్నాడు?" అన్నాడు తన గదిలోకి వెళ్తూ.

"నిద్రపోతున్నాడు" అంది.

అక్సా ఆలోచిస్తూ పెనిమిటిని వెంబడించింది.

ఉదయాన్నే తన పనివాడైన షెఫట్యాని పిలిచి తన విల్లు బాణమును తీసుకొని తనను వెంబడించమన్నాడు.

పొలములోనికి వెళ్ళిన తర్వాత మునుపు దావీదు తాను నిలుచున్న ప్రదేశంలో నిలిచి నేను వేయు బాణములను నీవు పరుగెత్తుకొని పోయి వెదకుమని చెప్పాడు. షెపట్య పరుగెత్తుతున్నప్పుడు ఒక బాణమును వాని అవతలకు వేసాడు. వాడు ఆ బాణము పడిన వైపునకు వస్తున్నప్పుడు బాణం నీ అవతల నున్నదని బిగ్గరగా కేకవేసి దావీదుకు వినబడిందా? అని ఆలోచించి నీవు ఆలస్యం చేయక దబ్బున పొమ్ము అని పెద్దగా అరచాడు. పనివాడు ఆ బాణములను కూర్చుకొని వచ్చినప్పుడు తన విల్లును వానికిచ్చి వీటిని ఇంటికి తీసికొని పొమ్మని చెప్పాడు.

పనివాడు వెళ్ళిపోగానే దక్షిణ దిక్కున ఉన్న పెద్ద బండ ప్రక్కనుండి దావీదు వచ్చి సాష్టాంగ నమస్కారం చేసాడు. మరలా నిలుచుని యోనాతానును చూచి రెండుసార్లు సాష్టాంగ నమస్కారం చేసాడు. ఈ లోగా యోనాతాను ఏడుస్తూ దావీదును ముద్దుపెట్టుకున్నాడు.

దావీదు మరి బిగ్గరగా ఏడుస్తూ యోనాతానును ముద్దుపెట్టుకున్నాడు. ఇంతకు ముందు వారి శరీరాలు వేరైనా ఆత్మ ఒక్కటిగా ఉంది. ఇప్పుడైతే ఇద్దరి శరీరాలు ఒక్కట య్యాయి. వారు ఏడుస్తున్నప్పుడు కళ్ళలో నుండి కారిన కన్నీరు కూడా ఒక్కటైయింది. కొంచెంసేపటికి తేరుకొని యోనాతాను కొంచెం వెనక్కి నడచి "యెహోవా నీకును నాకును మధ్యను నీ సంతానమునకు నా సంతానమునకు మధ్యను ఎప్పటికి సాక్షిగా నుండునుగాక మనమిద్దరం యెహోవా నామమును బట్టి ప్రమాణం చేసు కున్నాము గనుక మనస్సులో నెమ్మది కలిగిపొమ్ము" అన్నాడు.

దావీదు మరలా యోనాతానును కౌగిలించుకొని వెళ్ళిపోయాడు. యోనాతాను దావీదు వెళుతున్న వైపు అతను కనబడినంతసేపూ అలానే చూస్తూ ఉండి పోయాడు.

ఇప్పుడు యెబూసుకు పడమరగా ప్రయాణం సమూ యేలు. చెప్పిన మాటలు జ్ఞాపకమునకు వస్తున్నాయి. సమూయేలు దగ్గరకు వెళితే మరలా సౌలు అక్కడికి వస్తాడు. ఇశ్రాయేలు దేశాలలో ఎక్కడైనా సౌలు గూఢచారులకు తెలిసిపోతుంది.

యెబూసు కొండల పడమర తను అబీషైతో కలసి గొఱ్ఱెలను మేపిన అరణ్యములో కొంత భద్రత ఉంటుంది. తన జీవితంలో ఈ రోజుతో అన్ని పోయినవి. తన ప్రాణ స్నేహితుడు యోనాతాను, తన భార్య మీకాలును కాని ఇక ఈ జన్మలో చూడగలనా అనుకున్నాడు. తన తల్లిదండ్రులకు తన గ్రామమునకు, తన సహోదరులకు, స్నేహితులకే కాదు, మతపరమైన అన్ని ఆచారాలకు దూరమయ్యాడు. ఇంతకంటే చనిపోతే నయంగదా అనుకున్నాడు.

నోబులోని అహీమెలెకు గుర్తుకు వచ్చాడు. అహీమెలెకు తనని బహుగా గౌరవిస్తాడు. గొల్యాతును చంపి అతని ఆయుధములు నోబుకు పంపించాడు.

మూడు రోజులనుండి పొలములో ఊచబియ్యం మంచినీళ్ళు తప్ప మరి ఏ ఆహారం తీసుకోలేదు. నీరసంగా ఉంది. ఎక్కువ దూరం నడవలేడు కనుక దగ్గరలో ఉన్న నోబులో యాజకుని దగ్గర ఆహారం దొరుకుతుంది.

దావీదును చూడగానే అహీమెలెకుకు నోట మాట రాలేదు. గబగబ దావీదు దగ్గరకు వచ్చాడు. అతని ముఖంలో భయం స్పష్టంగా కనబడుతుంది. “నీవు ఒంటరిగా వచ్చితి వేమి?” అని అడిగాడు. అహీమెలెకుకు గిబియాలోని సంగతులు ఏమి తెలియవని గ్రహించాడు.

“రాజు నాకు ఒక పని నిర్ణయించి నేను నీకాజ్ఞాపించి పంపిన పని యేదో అది ఎవనితోనైనను చెప్పవద్దన్నాడు. నేనును నా పనివారును ఒకానొక చోటికి వెళ్ళ నిర్ణయించి తిని. నీ యొద్ద ఏమియున్నది? రొట్టెలుకాని మరేమియుగాని యుండిన యెడల అది నాకిమ్ము” అని అడిగాడు.

అహీమెలెకు మనస్సులో నొచ్చుకున్నాడు. దావీదు అంతటి వీరుడు రాజుగారి అల్లుడు తనని అడిగితే ఏమి ఇవ్వలేని స్థితిలో ఉన్నాడు. అయినా “సాధారణమైన రొట్టెలు నాయొద్ద లేవు. పనివారును, స్త్రీలకు ఎడమగా నున్నవారైతే ప్రతిష్ఠితమైన రొట్టెలు గలవు” అన్నాడు అహీమెలెకు.

“నిజంగా నేను బయలుదేరి వచ్చినప్పటి నుండి ఈ మూడు దినములు స్త్రీలు మాకు దూరంగానే ఉన్నారు. పనివాడి బట్టలు పవిత్రములే” అని కొంచెంసేపు ఆలోచించి యాజకుని దగ్గరగా వచ్చి “ఒకవేళ మేము చేయు కార్యము అపవిత్రమైన యెడలనేమి? రాజాజ్ఞనుబట్టి అది పవిత్రముగా ఎంచదగును” అని అన్నాడు దావీదు.

యాజకుడు అహీమెలెకు లోపలకి వెళ్ళి ఒక వస్త్రంలో ఆకువేసి రొట్టెలు చుట్టి దావీదు చేతికిచ్చాడు. దావీదు వాటిని తీసుకుంటుంటే లావుగా మొరటుగా ఉన్న ఒక వ్యక్తి లోనికి వచ్చాడు. అతని తలకు పాగాలేదు అతను ఎదోమీయుడని దావీదు గుర్తించాడు. సౌలు యొక్క పశువుల మందలు నోబు అరణ్యములో మేస్తున్నాయి కాబోలు. ఈ దోయేగు పశువుల కాపరులకు పెద్ద. అతను తనకు పట్టనట్లు ఉన్నా దావీదును గమనిస్తునట్లుగా అర్థమవుతున్నది. దోయేగు వైపు చూస్తూనే అహీమెలెకుతో “రాజుపని వేగిరముగా జరుగ వలెనని యెరిగి నా ఖడ్గమునైననూ, ఆయుధమునైననూ నేను తేలేదు. ఇక్కడ నీ యొద్ద ఖడ్గమైనను ఈటె అయినను ఉన్నదా?” అని అడిగాడు దావీదు.

“ఏలా లోయలో నీవు చంపిన గొల్యాతు అను ఫిలిష్తీయుని ఖడ్గమున్నది” అని కుడిప్రక్కన మూల లోత్తైన పీట మీద గుడ్డతో చుట్టబడిన ఖడ్గము చూపిస్తూ “అదిగో బట్టలో చుట్టబడి ఏఫోదు వెనుక వున్నది అది తప్ప ఇక్కడ మరి ఏ ఖడ్గమును లేదు. దాని తీసుకొనుటకు నీకిష్టమైన యెడల తీసికొనుము” అన్నాడు.

దావీదు గబగబ అక్కడికి వెళ్ళి ఆ ఖడ్గమును ఎత్తి చుట్టు వున్న బట్ట తీసివేశాడు. ఇప్పటికి సంవత్సరము దాటి మూడు నెలలు అయింది. ఈ ఖడ్గమును తాను పట్టుకొని. ఈ ఖడ్గమే చివరికి తనకు తోడైంది.

దీనికి సమమైనది లేదు అని దావీదు దానిని చేత పట్టుకొని అహీమెలెకు నకు నమస్కరించి వెళ్ళిపోయాడు.

చిక్కని అడవిగుండా ప్రయాణం చేస్తు యాజకుడిచ్చిన రొట్టెలు తింటూ నడక ప్రారంభించాడు. ఒక గంట నడచిన తర్వాత తన తండ్రి గొఱ్ఱెల మందలు కనిపించాయి. వాటిని చుట్టి ఒక చిన్న దిబ్బ ఎక్కి కలయచూస్తే అబీషై కనిపించాడు. మిగిలిన మంద కాపరులకు కనబడకుండా అబీషై దగ్గరగా వచ్చి చిన్నగా పిలిచాడు. **(సశేషం)**



# 'డ్యాన్స్ బేబి డ్యాన్స్'



'డ్యాన్స్ బేబి డ్యాన్స్', 'ఢీ', 'డ్యాన్స్ డ్యాన్స్' అని గెంతు లెయ్యడానికి రకరకాల పేర్లు పెట్టుకొని టి.వి. ప్రోగ్రామ్స్‌లో, స్టేజీల మీద అసభ్యకరమైన డ్యాన్సులు వేస్తుంటే అవి చూస్తూ మనం కూడా చాలా ఎంజాయ్ చేస్తాము కదా. 5 సం॥ల నుండి 70 సం॥ల వయస్సు వారి వరకు కూడా ఇలా స్టేజీల మీద డ్యాన్స్ చేయడం చాలా గర్వంగా ఫీలవుతుంటారు. కన్న తల్లిదండ్రులే చిన్నపిల్లలకి డ్యాన్సులు నేర్పించి స్టేజీ లెక్కిస్తు న్నారు. వాళ్ళ డ్యాన్సులు చూసి మురిసిపోతుంటారు. అలా డ్యాన్సులు చేసే పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయ్యేటప్పుడు, స్కూల్లో, కాలేజీల్లో కూడా స్టేజీల మీద డ్యాన్సులు చేస్తూ చివరికి క్లబ్బులు, పబ్బుల్లో కూడా డ్యాన్సు చేసే స్థాయికి ఎదిగి పోతారు. ఇలాంటి అన్యజనుల సంస్కృతి ఇప్పుడు చర్చీల్లోకి కూడా ప్రవేశించి, సండేస్కూలు పిల్లలకి స్టెప్పులు నేర్పించి స్టేజీల మీద డ్యాన్సులు చేయిస్తున్నారు. బాలుడు నడువవలసిన త్రోవను నేర్పించమంటే, ఇలా డ్యాన్సులు, స్టెప్పులు నేర్పించి అభం శుభం తెలియని పిల్లలను దేవునికి దూరం చేస్తున్నారు. ఎవరైనా ఇలా ఎందుకు అని నిలదీస్తే, తప్పేముంది దేవుని సన్నిధిలో దావీదు డ్యాన్సు చెయ్యలేదా అని సమర్ధించు కుంటారు. 'ఆహా, సాతానా, పాస్టర్లు, తల్లిదండ్రులలో దూరి ఎంత చక్కగా మాట్లాడిస్తున్నావు, హ్యాట్సఆఫ్ టూ యూ' అని చెప్పాల్సిందే. ఇలానే బైబిల్లో *'నీ పాదములకు రాయి తగుల కుండ వారు నిన్ను తమ చేతుల మీద ఎత్తి పట్టుకొందురు' (కీర్తనలు 91:12, మత్తయి 4:6)* అనే వాక్యము చూపించి యేసుప్రభువును బుట్టలో వేసుకోవాలని చాలా ప్రయత్నం చేసింది. ఇప్పుడు సోకాల్డ్ పాస్టర్లు కూడా 'దావీదు నాట్యము' చేసాడని బైబిల్లోవి చూపించి సమర్ధించుకుంటున్నారు కదా, మరి అదే దావీదు వ్యభిచారము చేశాడు కదా అని వ్యభిచారం చేస్తారా? అసలు పిల్లలకు ఏమి నేర్పమని దేవుడు చెప్పాడో ఈనాటి క్రైస్తవ లోకానికి తెలిస్తే కదా! *'మీరు ఈ నా మాటలను మీ హృదయంలోను మీ మనస్సులోను ఉంచుకొని... నీవు నీ యింట కూర్చుండునప్పుడు, త్రోవను నడుచునప్పుడు, పండుకొనునప్పుడు లేచునప్పుడు వాటిని గూర్చి మాటలాడుచు వాటిని మీ పిల్లలకు నేర్పి...' (ద్వితీయో. 11:18,19)* అంటే వాక్యము నేర్పమని కదా దేవుడు చెప్పింది. మరైతే మనమేమి నేర్పిస్తున్నాము? నేర్పడానికి ఇంకేం లేవన్నట్లు దేవుని పాటలకి సినిమా స్టెప్పులు నేర్పించి అదేదో పెద్ద ఘనకార్యము చేసినట్లు గొప్పలు చెప్పుకోవడం సాతాను ప్లాన్‌లో భాగం కాదని అను కుంటున్నారా? చదవగలిగిన పిల్లలతో బైబిలు గ్రంథమును మొదటి నుండి చివరి వరకు పూర్తిగా చదివించొచ్చుగదా అని అడిగితే వాళ్ళు పిల్లలు కదా ఎలా చదువుతారని చెప్తారు, పెద్దవాళ్ళు వేసే సినిమా స్టెప్పులు మాత్రం అవలీలగా వేసేలా మంచిగా ట్రైనింగ్ ఇస్తారు. *'ఏది దేవుడనబడునో, ఏది పూజింప బడునో, దానినంతటిని ఎదిరించుచు, దానికంతటికి పైగా వాడు (సాతాను) తన్నుతానే హెచ్చించుకొనుచు, తాను దేవుడనని తన్ను కనుపరచుకొనుచు, దేవుని ఆలయములో కూర్చుండును గనుక ఏ విధముగానైనను ఎవడును మిమ్మును మోసపరచనియ్యకుడి' (2థెస్స. 2:4)* అని హెచ్చరించినప్పటికీ వాక్యము తెలియని మూర్ఖులైన ఈ తరమువారు సాతానుచే మోసగింపబడుతూ తమ బిడ్డలను సాతానుకు అప్పజెప్తున్నారు. అందుకే సాతాను తానే వెలుగు దూత వేషము ధరించుకొని ప్రతిఒక్కరితో 'డ్యాన్సు బేబి డ్యాన్సు' ఆడిస్తూ పెద్దా, చిన్నా తేడా లేకుండా అందరిని దేవునికి దూరం చేస్తుంది. తల్లిదండ్రు లారా, మీ బిడ్డల విషయం బీ కేర్‌ఫుల్. మీ బిడ్డలకు వాక్యం నేర్పిస్తారో, డ్యాన్సులు నేర్పిస్తారో ఛాయిస్ ఈజ్ యువర్స్.

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# నీవు విత్తినదే కోస్తావు

మనం భూమిలో నాటిన విత్తనము దాని స్వభావాన్నిబట్టి దాని ఫలమును ఇస్తుందే తప్ప మనం కోరుకున్న ఫలమును ఇవ్వదు. అలాగే మనం చేసే క్రియలకు సంబంధించి ఎలాంటి ప్రతిఫలము రావాలో దేవుడు ముందే నిర్ణయించాడు కాబట్టి, ఎవరైనా సరే, దేవున్ని నమ్మిన వారైనా, అన్యులైనా వారికి వారి వారి క్రియలనుబట్టి దానికి నిర్ణయించబడిన ఫలితం వస్తుంది. అయితే దేవున్ని నమ్మి, దేవుని ఇష్టానుసారంగా మనం నడుచుకున్నందువల్ల మనకు ఒరిగేది ఏముంది అనుకోవచ్చు. మనం దేవుని బిడ్డలుగా ఉండి, దేవుని యెడల యథార్థ హృదయము కలిగి ఉంటే దేవుడు మనల్ని పాపము చేయకుండా కాపాడతాడు. ఆదికాండము 20:6లో దేవుడు అబీమెలెకు యొక్క యథార్థహృదయమునుబట్టి అబీమెలెకు పాపము చేయకుండా దేవుడు అడ్డుకున్నట్లు మనం చూడవచ్చు. దేవుడు సృష్టించిన మనిషి దగ్గరున్న అత్యాధునిక టెక్నాలజీ కన్నా దేవుని దగ్గరున్న టెక్నాలజీ చాలా గొప్పది. *'దేవుని వెఱ్ఱితనము మనుష్యజ్ఞానము కంటె జ్ఞానముగలది' (1కొరింథీ. 1:25).* ఈ లోకంలో మనిషి పుట్టిన దగ్గర్నుండి, చని పోయే వరకు జీవించే జీవితానికి సంబంధించి అంతా ఒక సిస్టమ్ పెట్టాడు దేవుడు. మనుష్యులు చేసే ప్రతి పని రికార్డు అవుతుం టుంది. మనం ఏం చేసినా దానికి సంబంధించిన ఫలితం అందులో ఉంటుంది. శరీరానుసారంగా జీవించేవారు శరీరము నుండి క్షయమను పంట, అనగా శరీరకార్యాలైన జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహములు, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలను పంటను కోస్తారు. ఇవి మనుష్యులను నశింపజేసి నరకమునకు పాత్రులను చేస్తాయి. ఆత్మాను సారంగా జీవించేవారు ఆత్మనుండి అక్షయమైన పంటను కోస్తారు. అనగా ఆత్మఫలములైన ప్రేమ, సంతోషము, సమాధా నము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనం, విశ్వాసం, సాత్వికము, ఆశానిగ్రహమను పంటను కోస్తారు. ఇవి మనుష్యులను జీవింపజేసి పరలోకరాజ్యమునకు పాత్రులను చేస్తాయి. మనం జీవించే జీవితాన్నిబట్టి మనకు ప్రతిఫలం దక్కుతుంది. కాబట్టి మనకు మంచి జరిగినా, చెడు జరిగినా అందుకు మనమే బాధ్యులము అవుతాము తప్ప దేవుడు అన్యాయంగా ప్రవర్తించడు. ఒకవేళ మనం దేవుడిని నిందిస్తే మనం మోసపోయినట్లే. మోసపోకుడి దేవుడు వెక్కిరింపబడడు. *'ఇదిగో త్వరగా వచ్చుచున్నాను. వాని వాని క్రియ చొప్పున ప్రతివానికిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నా దగ్గర ఉన్నది' (ప్రకటన 22:12)* అని యేసుప్రభువు సెలవిచ్చాడు. మన చేసే క్రియలు దేవునికి ఆమోదయోగ్యంగా ఉండి, మంచి ఫలములు పొందాలంటే మన ఇష్టప్రకారం కాకుండా దేవుని ఇష్టప్రకారం జీవించాలి. ఒకవేళ దేవుని ఇష్టప్రకారం కాకుండా మన ఇష్టప్రకారం జీవిస్తూ, ఈ లోకభోగాలు అనుభవించా లనుకుంటే అలాంటి వారికి వారి క్రియల చొప్పున వానికి జీతము నిర్ణయించ బడుతుంది. *'పాపము వలన వచ్చు జీతము మరణము' (రోమా 6:23)* కాబట్టి మనం మంచి క్రియలను చేసి మంచి ఫలములు పొందుదాము.


**ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్**

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# క్రిస్మస్ - యేసు ఎక్కడ?

గత డిసెంబర్ 25న క్రిస్మస్ వేడుకల తర్వాత మరలా ఎప్పుడో సంవత్సరానికి కదా ఈ ప్రపంచ పండుగ అని అనుకున్నాం. క్రిస్మస్ పండుగ ఫాస్ట్‌గా వచ్చేసింది. సంవత్సర కాలం ఇట్టే గడిచిపోయింది. వచ్చేసింది... క్రిస్మస్... యేసు జన్మదిన పండుగ... వచ్చేసింది...

ప్రపంచమంతా యేసుప్రభువా నీ జన్మదిన పండుగ ఎంతో సంబరంగా చేసికొని ఆనందిస్తున్నామని తమ కార్యాల ద్వారా అనగా, స్టార్స్, చర్చ్ అలంకరణ, ఇండ్లకు రంగులు వేయటం, ఖరీదైన వస్త్రాలు, మంచి భోజనాలు, బంగారు నగల అలంకరణ, క్రొత్త వస్తువులు కొనుక్కోవడం వంటి లోక సంబంధమైన కార్యక్రమాల ద్వారా తెలియజేస్తుంటాము.

అయితే ప్రాముఖ్యమైన విషయం ఏంటంటే ఈ పండుగ యేసు జన్మించిన పండుగ కనుక యేసును సంతోషపరచాలి. కానీ ఆ సంగతి ఎంతమంది గ్రహిస్తున్నారు? ఎవరి జన్మదిన వేడుకలో వారినే సంతోషపరచాలి, వారికి మంచి వస్తువులు కానుకలు, ఆభరణాలిచ్చి సంతోషపరచాలి. మరి క్రైస్తవులు ఏంటి? యేసు జన్మదినమున ఆయనను సంతోషపరచకుండా వాళ్ళని వాళ్ళే సంతోషపరచుకుంటారు. సంతోషిస్తే పరవాలేదు కానీ, జన్మదిన కారకుడైన యేసుని బహుగా దుఃఖపరచి వాళ్ళే సంతోషిస్తున్నారు. ఇది ఎంత అన్యాయం. "అన్యాయస్తులు దేవుని రాజ్యంలో ప్రవేశింపనేరరు". ఈ పండుగ దినాన మనం అన్యాయం జరిగిస్తే పై మాట గుర్తుంచుకోండి.

మనం మనల్నెల్లప్పుడు సంతోషింప చేసుకుంటాం కదా, ఈ ఒక్కరోజైనా యేసుని సంతోషపరచే విధంగా పండుగ చేసుకుంటే యేసు ఎంత ఆనందిస్తాడు. క్రిస్మస్ సందర్భంగా యేసుకి క్రొత్త వస్త్రాలు, మంచి భోజనం, కానుకలు, ఆపదలో, ఇబ్బందులలో, అవమానాలలో ఉన్న వారిని దర్శించి వారిని ఓదార్చి తగిన సహాయం చేయటం (నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించుట), బీదలకి, దిక్కులేని వారికి మంచి వస్త్రాలు, భోజనాలు ఇస్తే యేసుకిచ్చినట్లు కదా! అదే దేవుడు కోరేది (యాకోబు1:2). అలా చేస్తే దేవుడు ఎంత సంతోషిస్తాడో కదా! ఆయన సంతోషిస్తే మనకెన్ని దీవెనలో. అయితే మనం యేసు జన్మదిన సందర్భంగా అధిక పాపాలు చేసి ఆయనను రోజూ కంటే ఎక్కువగా దుఃఖపరుస్తున్నాం.

**క్రిస్మస్ సందర్భంగా మనం దేవుని దుఃఖపరచే విషయాలు :**

1. యేసుకి (పేదలకి) ఇవ్వవలసిన క్రొత్త వస్త్రాలు మనమే వేసుకుంటాం. కొంతమంది దయగలవారు పేదలకు చినిగినవి, పాతవి పేదలకు (యేసుకి) ఇచ్చి, తాము ఖరీదైన వస్త్రాలతో అలంకరించుకుంటారు.

2. మంచి భోజనం మనకు. ఎంగిలి భోజనం అనగా మనం తినగా మిగిలిన భోజనం పేదలకి (యేసుకి).

3. త్రాగుడు, జూదము, వ్యభిచార సంబంధమైన క్రియలు ఆ రోజే ఎక్కువగా చేసి విరోధి అయిన సాతానుని సంతోష పరచి యేసుని బహుగా దుఃఖపరుస్తాము.

4. క్రిస్మస్ సందర్భంగా మంచి మంచి ఖరీదైన నగలు, వస్తు వాహనాలు ఇంటిలోనికి తెచ్చుకుంటాము కానీ యేసుని బయటనే నిలబెడతాము.

5.అసలు వెలుగైన క్రీస్తుని కాకుండా గాలికొడితే ఆరిపోయే క్యాండిల్స్‌తో సంబరపడతుంటాము (యోహాను1).

6. క్రిస్మస్ రోజు దేవదూతలు పరలోకంలో గానం చేసి దేవుని మహిమపరచారు. ఆ సందర్భంగా మన ఇళ్ళలో చీకటి శక్తులు నాట్యం చేస్తున్నాయేమో ఆలోచించండి.

7. జన్మదిన వేడుకకు కారకుడైన యేసు లేకుండానే క్రిస్మస్ వేడుకా? క్రీస్తులేని క్రిస్మస్ ఎంత విడ్డూరం! ఎంత అన్యాయం!

దయచేసి విజ్ఞులైన మీరందరూ ఆలోచించండి. ఈ క్రిస్మస్ అయినా క్రీస్తును సంతోషపరచే విధంగా జరుపుకుందాం. హృదయాలలో నివసించే యేసు హస్తకృత్యాలలో నివసింపడు. మన ఆలయాన్ని ఎంతో అలంకరించుకుంటాం కానీ, యేసు నివసించేది హృదయాలలో కనుక, యేసు నివసించునట్లుగా మన హృదయాలను అపవిత్రపరచే వాటిని (మార్కు 7:21) తొలగించుకొని యేసు మనలో జీవించునట్లు మన హృదయాలని పవిత్రపరచుకొని (నిర్గమ.25:8) యేసుని సంతోషపరచి దీవెనలు పొందుదాము. యేసుని కలిగి యేసుతో క్రిస్మస్ పండుగ చేసికుందాము.

# మధ్యకాలము

బాగోగన్ ఈ మరణ వార్త విని కోపోద్రికుడై యెరూష లేమునకు వచ్చి దేశముపై ఎక్కువ పన్ను విధించెను. ఈ పన్నుల భారము అతని పాలనంతటిలో దాదాపు ఏడు సంవత్సరములు ఉండెను.

అర్తహస్తనిహన్ క్రీ.పూ. 359 సం॥లో తన కుమారుడైన ఓకస్ యొక్క మూర్ఖపు పనులనుబట్టి దుఃఖపూరితుడై మరణించెను. ఓకస్ యొక్క పెద్దతమ్ముడు అరియాసిన్ విషం త్రాగి మరణించునట్లు చిన్నతమ్ముడు హర్పతేషు ఉరివేసుకొని మరణించునట్లు మూర్ఖంగా ప్రవర్తించెను. ఆ విధంగా ఓకస్ తండ్రి రాజ్యమును, అధికారమును స్వతంత్రించుకొనెను.

ఓకస్ యొక్క పరిపాలన మూడవ సంవత్సరములో అనగా క్రీ.పూ. 356 సం॥లో మాసిదోనియాలోని 'పెల్లా' అను ప్రాంతములో అలెగ్జాండర్ ది గ్రేట్ అను బాలుడు జన్మించాడు. ఓకస్ 21 సం॥లు పరిపాలించిన తర్వాత తనకు ప్రియమైన గవర్నరు అయిన బగోయాస్ వలన విషం చేత చంపబడెను. రాజ్యం తనకు దక్కుతుందని, తన చిన్న కుమారుడైన ఆర్పస్ తలపై కిరీటము ఉంచవచ్చనే కుట్రతో బగోయాస్, ఓకస్ను హత్య చేశాడు. కాని తర్వాత తన చిన్న కుమారుడైన ఆర్పస్ని కూడా విషంతో చంపించాడు. నెహెమ్యా బంధువైన కొదోమానస్ని సింహాసనమును అధిష్టింప జేసెను. ఈ క్రొత్త రాజు దర్యావేషు అని తన పేరు మార్చు కున్నాడు. బగోయాన్ ఇతనికి కూడా విషపూరిత ద్రావకము నిచ్చి చంపాలని చూశాడు. కాని దర్యావేషు దానిని త్రాగుటకు నిరాకరించి తన ప్రాణమును కాపాడుకొని ఆ ఆపరాధిని శిక్షించెను. క్రీ.పూ. 336 సం॥లో ఆలెగ్జాండరు తండ్రియైన ఫిలిప్పు మాసిదోనియుడగు సైన్యాధ్యక్షుడైన పాపానియస్ వలన చంపబడ్డాడు. తన కుమారుడైన అలెగ్జాండరును మాసిదోనియా రాజుగా అభిషేకించెను. పర్షియా దేశము పైకి గ్రీకు దండయాత్ర జరిగింపక ముందు ఫిలిప్పు గ్రీసు దేశం యొక్క సమైఖ్య సైన్యానికి అధ్యక్షునిగా ఉన్న సమయంలో తన కుమార్తెను ఎపిరస్ రాజైన అలెగ్జాండరుకు యిచ్చి వివాహం చేశాడు. క్రొత్త ఎన్నికల ద్వారా కూడా అలెగ్జాండరు మాసిదోనియా రాజుగా ఎన్నుకోబడ్డాడు. ఒకే దండయాత్రలో ఆసియాలో ఉన్న చిన్న రాజులను ఓడించాడు. రెండు పర్యాయములు యుద్ధములు చేసి దర్యావేషును అధికారము నుండి తొలగించి అతని తల్లి, భార్యా, పిల్లలను చెరగొని పోయెను. అంతేకాక క్రీ.పూ. 302లో సిరియా తూరు దేశమంతటివి దోచుకొనెను.

అలెగ్జాండర్ తూరు పట్టణమును ముట్టడి వేయుచున్న పుడు గలలియ, సమరియు, యూదయ ప్రాంతములను తనకు లొంగిపొమ్మని ఆజ్ఞాపించెను. గలలియులు, సమరి యులు అతనికి లొంగిపోయారు. కాని యూదయ దేశస్థులు దర్యావేషు యెడల తమకున్న భక్తి, విశ్వాసముల చేత అతనికి లోబడలేదు. అందువల్ల అలెగ్జాండర్ ఉగ్రత వారిమీద రగులు కున్నది. అతడు తూరు దేశపు సముద్రపు ఒడ్డు నుండి ఆ పట్టణము నిలబడియున్న ద్వీపము వరకు నేలమట్టము గావించెను. ఆ తర్వాత యూదుల మీద కక్ష సాధించుటకై యెరూషలేమునకు ప్రయాణించెను. అతని రాకడ విని, ప్రధాన యాజకుడైన జుద్దువా మరియు పట్టణస్తులందరు భయాక్రాంతులయ్యారు. వారికి ఇప్పుడు దేవుని కాపుదల తప్ప మరో దారిలేదు. వారు ఉపవాసముండి ప్రార్థించారు. దేవుడు ఒక దర్శనం ద్వారా ప్రధానయాజకుని తన యాజక అంగీతో ప్రతి యాజకుని ఇంటివద్ద కలుసుకొని ఆ యాజకు లును, ప్రధాన యాజకుడును పట్టణస్తులందరును తెల్లని అంగీలతో పట్టణము వెలువల అలెగ్జాండరుమ కలుసుకొను టకు వెళ్ళుమని ఆజ్ఞాపించాడు.

ఈ విధంగా ప్రధాన యాజకుడును, పట్టణస్తులందరును తన వైపు కదలివచ్చుట చూచి ఏ దేవునికైతే ప్రధాన యాజకుడు యాజకత్వము చేయుచున్నాడో ఆ దేవుని యెడల భక్తి గౌరవములు ప్రదర్శించుటకై సద్భక్తితో విశ్వసనీయమైన గౌరవాభిమానముతో అతని ముందర మోకరిల్లెను. అంతే కాకుండా మాసిదోనియాయందు దియోమిన్లో ప్రధాన యాజకుడు అతనికి కలలో కనిపించి పర్షియా వారిపై విజయము పొందుదువని కూడా చెప్పెను. **(సశేషం)**

# యోసేపు

యోసేపు బేత్లెహేము వాస్తవ్యుడు. దావీదు వంశస్థుడు. అంటే యూదా రాజుల వంశములో పుట్టిన వ్యక్తి. రాజ వంశీయుడైనప్పటికి కాలగమనంలో పొట్టచేత పట్టకొని గలిలయలోని నజరేతు ప్రాంతానికి వలస వెళ్ళవలసి వచ్చింది.

యోసేపు దైవభక్తి కలిగిన యూదుడు. కాబట్టి మోషే ద్వారా దేవుడిచ్చిన ధర్మశాస్త్రమును, దేవుని ఆజ్ఞలను, మెస్సీ యాను గూర్చిన విషయాలు ఎరిగినవాడు. దేవునియందు నిరీక్షణ భయభక్తులు గలవాడు. నజరేతులో యోసేపు వడ్రంగి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. అతనిసత్ప్రవర్తన మరియ వంటి భయభక్తులు కలిగిన స్త్రీతో వివాహ ఏర్పాటుకు కారణమైంది. సాధారణంగానే పెండ్లి కార్యక్రమాలలో సరిజోడును చూస్తుంటారు. అయితే ఈ కాలంలోవలె అందం డబ్బు ఆస్తిపాస్తులు వంటి లోకసంబంధిత అర్హతలను బట్టికాక దేవునియందు భయభక్తులు కలిగిన వ్యక్తులుగా యోసేపు మరియలు సరిజోడి అయ్యారు. ఒకే ఊరివారు కావడం వలన, ఇరువురికి ముఖ పరిచయం ఉండి ఉ ంటుంది. వివాహ నిశ్చయానంతరం ఇరువురి మధ్య ప్రేమ చిగురించి ఉండవచ్చు.

వృత్తిరీత్యా యోసేపు దూర ప్రాంతాలకు వెళ్ళడం పని ముగియునంతవరకు అక్కడే ఉండటం పరిపాటి. అలా పని నిమిత్తం యోసేపు నజరేతును వీడిన సమయంలో మరియ గబ్రియేలు దూత ద్వారా రక్షకుని గర్భధారణను గూర్చి తెలుసుకొనుట, పరిశుద్ధాత్మ వలన గర్భము ధరించుట జరిగి ఉండవచ్చు. యోసేపు నజరేతులోనే ఉండి ఉంటే మరియ యోసేపుతో తాను పొందిన దర్శన అనుభవమును గూర్చి చెప్పి ఉండేది. దూత శుభవచనములు అని చెప్పిన ప్పటికి యూదా సమాజంలో వివాహానికి ముందు గర్భం దాల్చడం నేరం దాని పర్యవసానం మరణం. దాంతో మరియ మనస్సు నిమ్మళపరచుకొనుటకు బంధువురాలైన ఎలీసబెతు ఇంటికి వెళ్ళింది.

యోసేపు తన వృత్తి పనులలో తలముకలౌతున్నప్పటికి విరామ సమయాలలో మరియను గూర్చి, తన వివాహమును గూర్చి, తన భవిష్యత్ కుటుంబమను గూర్చి ఆలోచించేవాడు. అయితే దేవునియందు నమ్మికతో త్వరలో మరియను కలుసుకునే సమయం కొరకు ఎదురు చూస్తు ఉండేవాడు. అలా మూడు మాసాలు పైగా గడచిపోయాయి. తను వచ్చిన పని ముగించుకొని హృదయములో అమితమైన సంతోషంతో నజరేతు బయలుదేరాడు యోసేపు.

నజరేతు చేరిన యోసేపు ఆశ నిరాశ అయ్యింది. సంతోషం ఆవిరి అయ్యింది. మరియ గర్భవతి అని తెలుసు కొని దిగ్భ్రాంతికి గురై ఉండవచ్చు. ఎందుకంటే వారి వివాహ అర్హతే దేవునియందు భయభక్తులు. మంచి అమ్మాయి అనుకున్న మరియ గర్భవతి అవ్వడం జీర్ణించుకో లేక పోయాడు. బహుశ మరియను కలుసుకొని అడిగి ఉండ వచ్చు. ఆమెతో తర్కించి ఉండవచ్చు. ఆమె చెప్పిన విష యాలు అంగీకరించడానికి యోసేపు హృదయం సంసి ద్ధంగా లేదు. తన వంటి వ్యక్తికి దేవుడు ఈ పరిస్థితి ఎందుకు తీసుకువచ్చాడో అర్థం కాలేదు. ఏది ఏమైనప్పటికి తన కళ్ళెదురుగా కనబడుతున్న వాస్తవాన్ని అంగీకరించ మనస్సు రావడం లేదు.

మోషే ధర్మశాస్త్రాన్ని బాగుగా ఎరిగినవాడు కాబట్టి మరియకు వ్యభిచార నేరంక్రింద మరణశిక్ష విధిస్తారు కాబట్టి ఆమెను వివాహమాడి, పరిస్థితి సద్దుమణిగాక విడాకులు ఇచ్చి మరియ ప్రాణాల్ని రక్షించాలనుకున్నాడు యోసేపు.

మరియతో తను ఊహిచిన భవిష్యత్ ఆలోచనలు అన్ని పేక మేడల్లా కూలిపోయాయి. అందుకు కారణమైన మరియ మీద కోపం, ప్రతీకారం వంటి భావాలు యోసేపులో కనిపించవు. సరికదా ఆమె ప్రాణాలను రక్షించాలి అనుకున్నాడు.

బహుశా యోసేపు ఆ పరిస్థితి ద్వారా వెళ్ళవలసి వచ్చినప్పుడు దేవుని ఆశ్రయించి ఉండిఉంటాడు. అందుకే

అతను అటువంటి పరిస్థితిలోను వివేకముతో ఆలోచిం చాడు. దేవుని ఆశ్రయించే వారు మాత్రమే పరిస్థితికి భిన్నంగా దేవుని కోణంలో ఆలోచించగలరు.

కలలో దూత యోసేపుతో –మరియ గర్భము పరిశు ద్ధాత్మ వలన కలిగినది కాబట్టి ఆమెను భార్యగా చేసుకొమ్మని చెప్పింది. ఒక్క సెకను యోసేపు హృదయం సంతోషంతో నిండిపోయి ఉంటది. అంటే ఎగిరి గంతేసి ఉంటాడు. అయితే అంతలోనే అతని హృదయంలో అంతులేని, ప్రశ్నలు ఆ సంతోషాన్ని కబళించివేశాయి ఆమె పవిత్రురాలని తెలిసినందుకు సంతోషించాలో లేక గర్భవతియైన స్త్రీని వివాహమాడి తన స్నేహితులు, బంధు జనాంగం ముందు చేతకాని వాడిలా తెలివి తక్కువ వానిగా కనబడాల్సి వస్తుందనే భయంతో దుఃఖించాలో అర్థం కాని మీమాంసా.

మెస్సీయాను గూర్చిన ప్రవచనం ఎరిగిన వానిగా, దేవుని చిత్తానికి తలఒగ్గే ఒక మంచి యూదునిగా తన వారి ముందు ఒక తెలివితక్కువ వాని వలె, చేతకాని వాని వలె నిలబడుటకు నిశ్చయించకున్నాడు. మరియను వివాహం చేసుకున్నాడు. యోసేపు హృదయంలో దేవుని చిత్తాన్ని నెరవేరుస్తున్నాను అనే ధైర్యం ఉన్నప్పటికి, నలుగురిలో ఉన్నప్పుడు వినబడే సూటిపోటి మాటలు, వెక్కిరింతలు, ఛీత్కారాలు విని బాధ అనుభవించి ఉండవచ్చు దేవుని నిమిత్తం వాటిని సహించి ఉండవచ్చు ఎందుకంటే ఎప్పుడైనా లోకం పోకడ ఒకటే.

మనుష్యుల నుండి వచ్చే శోధన ఒక వైపు ఉంటే యవ్వనస్థుడైన యోసేపు మరియను వివాహము చేసుకొని ఆమెకు దూరముగా ఉండుట మరొక శోధన. అయినప్పటికి దేవుని చిత్తమును నెరవేర్చు నిమిత్తం తన శరీరాన్ని నలగగొట్టుకొనిన భక్తిపరుడు యోసేపు.

పరిస్థితి కాస్త సద్దుమణిగి పరిస్థితులు అనుకూలిస్తున్నా యనుకునే తరుణంలో కైసరు ప్రజాసంఖ్య చాటింపు విని ఆలోచనలో పడ్డాడు యోసేపు. నిండు చూలాలైన మరియతో బేత్లెహేము ప్రయాణం ప్రమాదకరం. ఆ పరిస్థితి కల్పించిన దేవుని మీదనే భారం వేసి ఇరువురు బేత్లెహేము ప్రయాణం కట్టారు. ఎంతో కష్టపడి, ప్రయాసతో గమ్యస్థానం చేరిన యోసేపు దంపతులకు మరలా నిరాశ సత్రంలో స్థలం లేక పోవడం. చలికాలం. నిండుచూలాలు తప్పనిసరి పరిస్థితిలో పశువులపాకలో తలదాచుకున్నారు యోసేపు మరియలు.

ప్రసవసమయంలో ఆడవాళ్ళు పడే వేదన అందరికి తెలిసిందే. మరియమ్మ ప్రసవవేదనలో ఆమెను ఓదార్చినది, సహాయపడినది అన్ని రకాలుగా యోసేపే అయి ఉండవచ్చు. లోకరక్షకునికి జన్మనిచ్చిన మరియమ్మను హత్తుకొనిన మీదట తను పడిన వేదన, శ్రమను మరచిపోయాడు యోసేపు.

దేవుని చిత్తమును నెరవేర్చుట ఎంతో కష్టము అనుటకు యోసేపు జీవితంలో ఈ సందర్భము ఉదాహరణ. అడుగడున ఎదురౌతున్న విపరీత పరిస్థితులను ఎదుర్కొని దేవుని చిత్తాన్ని నెరవేర్చి పరిశుద్ధ గ్రంథములో స్థానం సంపాదించిన భక్తిపరుడు నీతిమంతుడు యోసేపు.

## చందాదారుల వివరములు

1. అపో. ఎబినేజర్‌గారు (హైదరాబాద్)–1500 (నెలకు)
2. గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) –1000
3. మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/–
4. వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/–
5. జి. కళావతి, ఒంగోలు 350/–
6. వి. కస్తూరి, భీమవరం 500/–
7. జయ, గుంటూరు – 1500/–
8. కె. రజిని, నరసరావుపేట – 1000/–
9. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/–
10. శ్రీమతి కె. కల్పన, గోవా – 350/–
11. శ్రీ జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి – 350/–
12. శ్రీమతి సి. హెచ్. స్వయంప్రభ, చిలకలూరిపేట – 350/–
13. కె. రాజేష్, రాజమండ్రి – 350/–
14. శ్రీమతి వై. సంధ్యారాణి, ఒంగోలు – 2000/–
15. పి.వి.రెడ్డి, ఒంగోలు – 500/–
16. బి. నెహెమ్యా, చిన్నగంజాం – 500/–
17. నైటింగేల్, నెల్లూరు – 500/–

# పరమ వైద్యుడు

నా పేరు సుగుణమ్మ. బాల్యంలోనే తండ్రిని పోగొట్టు కొనినందున మేనమామగార్ని ఆశ్రయించడం జరిగింది. మాది హిందూ సాంప్రదాయ కుటుంబం. కాని ప్రభువు మహాదయవల్ల నా తల్లి, మనమేమగార్లు ప్రభువును నమ్మారు. థామ్సన్, మిస్సమ్మగారి బోధలవల్ల మా అమ్మగారు మహాలక్ష్మిగారు బాప్తిస్మం తర్వాత జమాయమ్మ పేరుతో యేసును తన స్వీయ రక్షకునిగా అంగీకరించారు. నా అసలు పేరు మంగమ్మ. మూడవ తరగతిలో 9 సం॥ల వయస్సులో అమ్మతో పాటు బాప్తిస్మం తీసికొని సుగుణమ్మగా మారాను. మా బంధువులంతా అన్యదేవతలను ఆరాధించేవారు. ఇప్పటికీ కొందరు అదే విశ్వాసంలో ఉన్నారు.

నేనైతే దేవుని నమ్మకంలో పెరిగాను. రక్షణాను భవంలో ఉన్నాను. కీర్తన. 52:8, నేనైతే దేవుని మందిరంలో పచ్చని ఒలీవ చెట్టువలె ఉన్నాను. నిత్యము దేవుని కృప యందు నమ్మికయుంచుచున్నాను. ప్రభువును వెంబడించు టలో ప్రత్యేక క్రమాన్ని క్రీస్తువలె వాడుక చొప్పున వాక్య పఠనము, ప్రార్థన బోధించుటయందు ఎడతెగక ఉండునట్లు ప్రభువు నన్ను బాగుగా ఆశీర్వదించారు.

నా 15 సం॥ల వయస్సులో మల్లయ్యగారితో వివాహం జరిగింది. వివాహ కార్యక్రమానికి బంధువుల అవసరం ఉండడంతో ఇష్టంలేకున్నా బంధువుల ఒత్తిడి వల్ల వివాహం హిందూపద్ధతిలో చేసుకొనుటకు అంగీకరించాను. కాని ఆ తర్వాత పూజలకు నన్ను ఒత్తిడి చేయలేదు. ప్రార్థనతో విశ్వాసంతో వివాహ జీవితం సాఫీగా సాగింది. నాకు దేవుడు ముగ్గురు మగబిడ్డలను స్వాస్థ్యంగా బహుకరించారు. ఒకసారి మాత్రమే నా ఆచారంలో పొరపాటు చేసాను. పెద్దబాబు పుట్టినప్పుడు శాంతి చేయించాము. మనస్సు నొచ్చుకుంది. దావీదువలె (కీర్తన 51) గోజాడి దేవుని నుండి క్షమాపణ పొందుకున్నాను. ఆ తర్వాత నవంబర్ నెలలో కార్తీక మాసంలో నోములువంటి ఆచారాలన్నీ తప్పించుకున్నాను ముగ్గురు బిడ్డలను విశ్వాసంలో పెంచాను. అద్భుత రీతిగా నా భర్త మల్లయ్యగారు కూడా బాప్తిస్మ అనుభవం పొందారు.

నా శరీరం క్రమేపీ క్షీణింపనారంభించింది. నరాల బలహీనత, అనేక ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. అన్నింటిలో దేవుని ప్రార్థించి విజయాన్ని సాధించాను. అన్ని సమస్యలందు దేవుడే నాకు అండగా, కోటగా, కాపరిగా ఉండి నడిపించారు.

పెద్దబాబు పుట్టినప్పుడు (నా వయస్సు 18 సం॥లు). నాకు నరాల బలహీనత ఆవరించి, ప్రమాదస్థితిని ఎదుర్కొ న్నాను. నాలుగు నెలలు ఆస్పత్రి పాలయ్యాను. రోజుకు 8 ఇంజక్షన్లు చేసేవారు. అప్పట్లో ఆధునిక వైద్యం లేకపోవడం, అందుబాటులో ఉన్న వైద్యంలోను మందుల లోపం వల్ల ఒక ఇంజక్షన్ రియాక్షన్ వల్ల శరీరమంతా నీలిరంగు మారి డాక్టర్లు బ్రతుకుట అసాధ్యమని యింటికి కబురు చేసారు.

నా బలహీతనలో దేవుని శక్తి పరిపూర్ణమవుతుందనీ, క్రీస్తు సిలువల కార్చిన అమూల్య రక్తము ద్వారా తన బిడ్డగా చేసి విశ్వాసమందు నన్ను బలపర్చుతుంది గనుక తాను పొందిన గాయముల చేత నాకు స్వస్థత ఉందన్న దృఢ నమ్మకంతో "ప్రభువా, నీవే నా రక్షకుడవు. నన్ను స్వస్థపరచే దేవుడవు నీవే, నీ కొరకు జీవించి, నీకు సాక్షిగా నిలుస్తాను, కనికరించు దేవా'' అని కన్నీటితో మొఱ్ఱపెట్టాను. అపత్కాలంలో నేను నమ్ముకొని నా దేవుడు అదృశ్య రూపంలో నన్ను బ్రతికించారు.

ఎవరు పెట్టారో తెలియదుగాని, నా సమీపంలో తెల్లని కప్పు ఎరుపు రంగు జ్యూస్, అది యాపిల్ జ్యూస్‌వలె ఉంది. అది నాకివ్వబడింది ఆ రుచి చూచి ఎరిగితిని. అది ఎంతో మాధుర్యంగా తీయగా ఉంది. ఆ రుచి ఎన్నటికి మరువలేను. యిది ఎవరిచ్చారు అని తలస్తున్నప్పుడు, "యిది మనుష్యులు యిచ్చింది కాదు, యిది యేసు రక్తం" అనే మెల్లని స్వరము వినబడింది. దేవున్ని ఎంతగానో స్తుతించి,

ఘనపరచాను. మరుసటి రోజు నుండి అద్భుత స్వస్థత కలిగింది. నా ప్రమాద పరిస్థితి నాకు తెలియలేదు. మా మామయ్య, అమ్మ వచ్చి "నీకు మరణం తప్పింది నీకు చావు లేదు" అని అన్నారు..

ఒకరోజు రెస్ట్‌రూంలో అకస్మాత్తుగా పడిపోయాను. తలనొప్పితో బాధపడగా ఆస్పత్రిలో స్కానింగు తీయగా బ్రెయిన్ ట్యూమర్ అని, తప్పక ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. నేను బ్రతుకుతానన్న ఆశ అడుగంటింది. చాలా అధైర్యముతో ఉన్నాను. కన్నీటితో ప్రార్థించసాగాను.

1. కీర్తనలు 147:3– గుండె చెదరిన వారిని ఆయన బాగు చేయువాడు వారి గాయములు కట్టువాడు. 2. కీర్తనలు 145:11– నిజముగా మొర్రపెట్టువారికందరికి యెహోవా సమీపముగానున్నాడు. 3.కీర్తనలు 143:11– యెహోవా నీ నామమునుబట్టి నన్ను బ్రతికింపుము 4. కీర్తనలు 119:175– నీవు నన్ను బ్రతికింపుము నేను నిన్ను స్తుతించెదను. 5. కీర్తనలు 88:10,11 – మృతులకు నీ అద్భుతములు చూపెదవా? ప్రేత లేచి నిన్ను స్తుతించెదరా? సమాధిలో నీ కృపను స్తుతించెదరా? సమాధిలో నీ కృపను ఎవరైనా వివరింతురా? నాశన కూపములో నీ విశ్వాస్యత ఎవరైనా చెప్పుకొందురా? అంధకారములో నీ అద్భుతము తెలియ నగునా? పాతాళములో నీ నీతి తెలియునా? యెహోవా నే నీతోనే మనవి చేయుచున్నాను. నేను మరణిస్తే నీకు లాభమేమి ప్రభువా నీవు నన్ను సజీవంగా ఉంచితే క్రీస్తే రక్షకుడని సాక్ష్యమిస్తాను నా పరిపూర్ణత నీవు చూడగల్గితే నన్ను నీ సన్నిధిని చేర్చుకో, లేదా నన్ను సజీవంగా ఉంచితే, మంగళగిరిలో నీ సాక్షినవుతాను అని ప్రార్థించుకున్నాను.

నా ప్రార్ధనా అవసరతను గూర్చి కొంతమంది ఆత్మీయులకు తెలియపరచి వారి ప్రార్థనా సహాయాన్ని కోరాను. వారంతా సహవాసంలో ప్రార్థన జరిపారు. ఇక్కడ నన్ను ఆపరేషన్ సిద్ధపరచి తల వెంట్రుకలు కత్తిరించి సంసిద్ధంగా ఉంచారు. ఆ రోజు నాతోపాటు ఇంకొందరికి ఆపరేషన్ చేయుటకు సిద్ధపరిచారు. అందరి ఆపరేషన్లు పూర్తి చేసారు. కాని అద్భుతం నాకు కొంత వ్యవధి యిచ్చారు.

మరల ఎక్స్‌రేలు, స్కానింగ్‌లు తీశారు. అనంతరం వారి అనుమతికై కనిపెట్టే రోజుల్లో ఒక కల వచ్చింది. కలలో ఎవరో ఒక అజ్ఞాత వ్యక్తి ఆపరేషన్ చేసినట్లుగా చూచాను, హల్లెలూయా! ఆశ్చర్యకరుడైన పరమ వైద్యుడు క్రీస్తు నన్ను స్వస్థపరిచాడని విశ్వసించాను. అదే నమ్మకంతో డాక్టరుగారి వద్ద పరీక్షకు వెళ్ళినప్పుడు "నీకు ఆపరేషన్ అవసరం లేదమ్మ" అని అన్నారు. చెప్పనశక్యము గాని సంతోషంతో దేవుని స్తుతించుకున్నాను. చిక్కుల బెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయి దానిని కొనసాగించు వాడునైన యేసువైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన పందెంలో ఓపికతో పరుగెత్తాలని నా ఆశ.

నా కుమారుని సహాయంతో పేదవారికి విద్యా సేవ చేయడంతో పాటు ఒక సంఘాన్ని నిర్మించి సహవాసం ఆరంభించాను. నా సేవ ఫలభరితం కావాలని ప్రార్థించండి, దేవుడు మిమ్ములను దీవించునుగాక, ఆమేన్.

## గమనిక

క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.

**యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి ఆయన నామమును ప్రకటన చేయుడి. జనములలో ఆయన కార్యములను తెలియచేయుడి. కీర్తనలు 105:1**

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడల వాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

## మహా దార్శనికురాలు

# కీ.శే. డా॥ లలిత చిక్కాల

**(బేర్ క్రిస్టియన్ హాస్పిటల్, చీరాల)**

**కొందరు మృతిపొందినా వారి క్రియల ద్వారా అనేకుల హృదయాలలో జీవించే ఉంటారు. అలాంటి అమరజీవి శ్రీమతి డా॥ లలితా చిక్కాలగారి గురించి కొన్ని వాస్తవాలు...**

1937వ సం॥ మే నెల 6వ తారీఖున బేర్ హాస్పిటల్ నందు శ్రీ బొల్లాపల్లి దేవదత్తం, శ్రీమతి ఇవాంజిలిన్ గార్లకు లలితాబాయి జన్మించారు. డా॥ఎమ్మాబేర్‌గారి ద్వారా నడుపబడుతున్న బాలికల వసతి గృహంలో లలితాబాయిగారి అమ్మమ్మగారైన శ్రీమతి చిక్కాల అన్నమ్మగారు మేట్రన్‌గా పనిచేస్తుండేవారు. ప్రార్ధనా పరురాలైన అన్నమ్మగారు తన సంరక్షణలో ఉన్న లలితాబాయిగారికి చిన్న వయసులోనే ప్రార్ధించటం నేర్పించారు. పరిశుద్ధ గ్రంధాన్ని పరిచయం చేశారు. క్రీస్తును గురించిన పాటలు, కథలు, భక్తుల జీవిత చరిత్రలను నేర్పి ఎంతో భక్తిశ్రద్ధలతో పెంచారు.

చదువంటే ఆసక్తి కలిగిన లలితాబాయి గారు యస్.యస్.యల్.సి. వరకు గుంటూరులోని స్టాల్ గరల్స్ హైస్కూల్ హాస్టల్ లో ఉండి చదువుకున్నారు. కష్టపడి చదివి యస్.యస్.యల్.సి. పరీక్షలో స్కూల్ ఫస్ట్‌గా నిలిచారు. గుంటూరులోని ఆంధ్రక్రైస్తవ కళాశాలలో ఇంటర్మీడియేట్‌ను పూర్తి చేసి ఆంధ్రా ఇవాంజిలికల్ చర్చి వారి స్పాన్సర్షిప్ ద్వారా క్రిష్టియన్ మెడికల్ కాలేజి (సి.యం.సి) వెల్లూరు నందు యం.బి.బి.యస్. పూర్తి చేశారు. హౌస్సర్జన్సీ అయి పోయిన వెంటనే ఏ.ఇ.యల్.సి. లూథరన్ మిషన్ హాస్పిటల్, రాజమండ్రినందు వైద్యురాలిగా పనిచేశారు.

వైద్యం చేసేది తానే అయినా స్వస్థపరిచేది మాత్రం ఆ దేవాదిదేవుడేనని బలంగా విశ్వసించిన ఆమె ప్రతిరోజు హాస్పిటల్లో తన దినచర్యను ప్రార్ధనతో ప్రారంభించేవారు. తను చికిత్స చేస్తున్న ప్రతి రోగిని గురించి, తనకు సహాయ పడుతున్న ఇతర వైద్యసిబ్బంది గురించి క్రమం తప్పకుండా అనుదినం ప్రారించేవారు.

1961 మే నెల 31వ తేదీన డా॥ లలితాగారికి శ్రీ చిక్కాల నతానియేల్ ఫ్రెడ్రిక్‌గారితో వివాహం జరిగినది. డా॥ లలితా చిక్కాలగారు గుంటూరు కుగ్లర్ హాస్పిటల్‌కు బదిలీ అయ్యారు. శ్రీ చిక్కాల ఫ్రెడ్రిక్‌గారు గుంటూరు ఏ.సి. కాలేజీనందు జువాలజీ లెక్చరర్‌గాను, యన్.సి.సి. ఆఫీసర్ గాను పనిచేస్తూ ఉండేవారు. శ్రీ నతానియేల్ ఫ్రెడ్రిక్ చిక్కాల గారు పశ్చిమబెంగాల్ యన్.సి.సి. డైరక్టరేట్‌నందు పనిచేయుటకు కలకత్తాకు బదిలీ కావడంతో డా॥ లలితా చిక్కాలగారు కలకత్తా వెళ్ళి, కలకత్తా విశ్వవిద్యాలయ అనుబంధ సంస్థ అయిన జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛైల్డ్ హెల్త్‌నందు డిప్లొమో కాలేజీలో చేరి యూనివర్సిటీలోనే ప్రధమురాలిగా ఉత్తీర్ణురాలై బంగారు పతకమును పొందారు.

గుంటూరు తిరిగి వచ్చిన పిదప డా॥ లలితా చిక్కాల గారు కుగ్లర్ హాస్పిటల్‌నందు శిశువైద్య విభాగమును ప్రారంభించి, శిశువైద్య నిపుణురాలిగా నియమింపబడ్డారు. కుగ్లర్ హాస్పిటల్లో పనిచేస్తూనే, సామాజిక సేవాకార్య క్రమంలో భాగంగా పేరేచర్లలో ఏర్పాటుచేసిన సోషల్ సర్వీస్ హెల్త్ క్లినిక్‌లో వారానికి ఒకసారి రోగులకు వైద్యచికిత్స చేస్తుండే వారు. అంతేకాకుండా ఏ.ఇ.యల్.సి. కమ్యూనిటీ హెల్త్ క్లినిక్ మాచర్లలో కూడా నెలకు ఒకసారి వెళ్ళి వైద్య సేవలు అందించేవారు. 1970వ సం॥లో వెల్లూరు నందు M.D., Pediatrics కోర్సును పూర్తి చేసుకొని, తిరిగి కుగ్లర్ హాస్పిటల్లో పనిచేయటానికి నియమింపబడి 1976 వరకు పనిచేశారు.

దూర ప్రాంతాల నుండి వచ్చి గుంటూరులో చదువు కుంటూ హాస్టల్ వసతి దొరకని అనేక మంది విద్యార్థులకు డా॥ నతానియేల్ ఫ్రెడ్రిక్‌గారే యింట ఆశ్రయమిచ్చే వారు. అలాంటి విద్యార్థులు అందరినీ డా॥లలితా చిక్కాలగారు ఆదుకొని తల్లిలా ఆశ్రయమిచ్చేవారు. విద్యార్థులే కాకుండా చికిత్స నిమిత్తం వచ్చిన అనేకమందికి ఆ యిల్లే ఆశ్రయమయ్యేది.

కుక్‌కౌంటీ హాస్పిటల్ చికాగోనందు Pediatrics రెసిడెన్సీ ప్రోగ్రామ్ నిమిత్తం శ్రీమతి డా॥లలితా చిక్కాలగారు అమెరికా వెళ్ళారు. వారు వెళ్ళిన ఒక సంవత్సరం తరువాత ఫ్రెడ్రిక్‌గారు కుటుంబంతో అమెరికాకు వెళ్ళి క్లీవ్‌లాండ్ యూనివర్సిటీలో ఇమ్యునాలజీలో పి.హెచ్.డి. చేశారు.

డా॥ లలితా చిక్కాలగారు వారి కోర్సును దిగ్విజయ ముగా పూర్తి చేసుకుని క్లీవ్‌లాండ్‌లోని ఫెయిర్ వ్యూ జనరల్ హాస్పిటల్లో తన సేవలు అందించారు. మెడికల్ స్కూల్ ఆఫ్ కేస్ వెస్ట్రన్ రిజర్వ్ యూనివర్సిటీ నుండి వైద్యశిక్షణ నిమిత్తం అనేకమంది వైద్య విద్యార్థులు ఆ హాస్పిటల్‌కు వచ్చేవారు. అలా వచ్చిన వైద్య విద్యార్థులకు డా॥ లలితా చిక్కాలగారు బోధించి, శిక్షణ ఇచ్చేవారు. ఆమె చేసిన బోధనకుగాను అనేక సంవత్సరముల వరకు స్థానిక వైద్యులకు అందించే ఉత్తమ ఉపాధ్యాయ సత్కారాన్ని పొందారు. 1992వ సం॥లో డా॥ నతానియేల్ ఫ్రెడ్రిక్‌గారు అట్లాంటాలోని ఎమోరీ విశ్వవిద్యాలయములో ప్రొఫెసర్‌గా నియమింపబడటంతో 1995వసం॥లో శ్రీమతి డా॥లలితా చిక్కాలగారు అట్లాంటా లోని బాలల ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి అనుబంధ సంస్థ అయిన ఎగ్గోల్డన్ హాస్పిటల్‌నందు పనిచేయ మొదలుపెట్టి 2005లో ఆమె ఉద్యోగ విరమణ చేసే వరకు పనిచేశారు.

అట్లాంటాలో వారు ఉన్న సమయంలో అట్లాంటా తెలుగు క్రైస్తవ సమావేశము యొక్క అన్ని కార్యక్రమ ములలోను చాలా చురుకుగా పాల్గొనేవారు. అట్లాంటాలోని అనేక అపార్టుమెంట్లలో నివసిస్తున్న అనేకమంది క్రైస్తవేత రులకు సువార్తను అందించేందుకు శ్రీమతి రోజ్‌వల్లిగారితో కలిసి ప్రతి వారాంతము సువార్త చేస్తుండేవారు. అంతే కాకుండా ఇండియా నుండి వచ్చే దైవసేవకులకు, సువార్త పరిచారకులకు వారి ఇల్లు బేతని గృహములా ఉండేది. కొందరు ఎరుగకయే దేవదూతలకు ఆతిథ్యమిచ్చిరి. హెబ్రీ 13:1 అనే వాక్యమును పరిపూర్ణముగా విశ్వసించిన డా॥ లలితా చిక్కాల తన యింటికి వచ్చిన అతిథులను ఊపిరి సలపని పనిలో ఉండి కూడా చాలా ఆదరంగా చూచేవారు.

2002లో ఇండియా వచ్చిన చిక్కాల దంపతుల దృష్టికి బేర్ హాస్పిటల్ పునరుద్ధరణ అభ్యర్థన వచ్చింది. 2006వ సం॥ మే నెల 7వ తారీఖున అప్పటి రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ డా.వై.యస్. రాజశేఖరరెడ్డిగారి అండదండలతో, నాటి వైద్య ఆరోగ్యశాఖామాత్యులైన శ్రీ కొణిజేటి రోశయ్యగారి హస్తాల మీదుగా ఆనాటి ఏ.ఇ.యల్.సి. సంఘ మోడరేటర్ మోస్ట్ రెవ.క్రిష్టఫర్‌గారి ఆశీస్సులతో బేరు క్రిస్టియన్ హాస్పిటల్ అను పేరుతో పునః ప్రారంభించబడినది.

మొదట ఔట్ పేషెంట్ క్లినిక్‌గా ప్రారంభించబడి డా॥ లలిత చిక్కాలగారి ఆధ్వర్యంలో దినదినా భివృద్ధి చెందడంతో ఒక ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించి ఐదు పడకల ఆసుపత్రిగా రూపుదిద్దారు. అచిరకాలములోనే శిశుప్రసూతి విభాగమును కూడా కలుపుకొని 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేశారు. డా॥ లలిత చిక్కాలగారి ఆధ్వర్యంలో ప్రతి ఉదయం ఆసుపత్రిలో దైవ సంకీర్తన, వేదపఠనం మరియు ప్రార్థనతో దినచర్య ప్రారంభమయ్యేది. ఇన్ మరియు అవుట్ పేషెంట్స్ కొరకు నిత్యము ప్రార్థనలు జరుగుతూ వుండేవి. ప్రతి బుధవారం బైబిల్ స్టడీ ప్రతి శుక్రవారం ఆసుపత్రి వైద్య సిబ్బంది అందరి కొరకు ప్రార్థనలు చేసేవారు. అలాగే ఆసుపత్రిలో చికిత్స పొంది ఇండ్లకు వెళ్ళిన రోగుల ఆరోగ్య పరిరక్షణకై మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఉచితంగా మందులు అందించే వారు. అనేకమంది పేద ప్రజలు, డెంగ్యూ జ్వరానికి బేరు క్రిస్టియన్ హాస్పిటల్ చీరాలలోనే మంచి వైద్యం దొరుకు తుందని సుదూర ప్రాంతాల నుండి వచ్చేవారు.

చదవడాన్ని ఇష్టపడే డా॥ లలితా చిక్కాలగారు విద్యను అభ్యసించడానికి వయస్సు అడ్డంకి కానే కాదని నిరూపిస్తూ, బేర్ క్రిస్టియన్ హాస్పిటల్‌కు అనుబంధంగా ప్రారంభించ బడిన వేదపాఠశాలలో వేదాంత విద్యను నేర్చుకొని "వేదాంత విద్య"లో డిగ్రీ స్వీకరించారు.

శ్రీ, శ్రీమతి చిక్కాలగార్లు కలసి జార్జియా రాష్ట్రం, స్నెల్‌విల్లె ప్రాంతంలోని ఓక్‌రోడ్ లూథరన్ చర్చి సహాయంతో చిక్కాల కుటుంబమంతటినీ భాగస్వాములను చేస్తూ, 'చీరాల విద్య మరియు వైద్య ట్రస్టును' ఏర్పాటు చేశారు. ఆ ఓక్‌రోడ్ చర్చి సభ్యులైన డా॥ జెర్రిరొష్‌గారు 2007వ సం॥ నుండి ప్రతి సంవత్సరం ఇండియా వచ్చి బేర్ క్రిస్టియన్ హాస్పిటల్

నందు ఉచిత దంతవైద్య శిబిరమును నిర్వహిస్తున్నారు. ఖరీదైన వైద్యచికిత్సను పొందుకోలేని పేద, బడుగు వర్గాల వారికి అత్యుత్తమ వైద్యచికిత్స అందించటానికి నిరంతరం పాటుపడే డా॥ లలితా చిక్కాలగారి కృషిలో డా॥ నతానియేల్ ఫ్రెడ్రిక్ చిక్కాలగారి పూర్తి సహాయ సహకారాలుండేవి.

శ్రీమతి చిక్కాలగారి విశిష్ఠ సేవలను గుర్తించిన జాయింట్ యాక్షన్ కమిటి ఆఫ్ అసోసియేషన్స్, చీరాల అనే ధార్మిక సంస్థ 'అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భం'గా తేది 28-03-2017న డా॥ లలిత చిక్కాల గారిని 'సేవాతత్పరిణి' బిరుదుతో సత్కరించి, గౌరవించారు.

సామాజిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా చీరాల సమీపంలోని పెక్కు గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్య చికిత్స మరిము మందులు ఇచ్చేవారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కేఫా పౌండేషన్ అధ్యక్షురాలైన డా॥ హెలెన్ హేమలత సైమన్ మరియు ఆపరేషన్ బ్లెస్సింగ్ అను సంస్థ వారి సహకారంతో నాలుగు రోజులపాటు వైద్య శిబిరముల ద్వారా కంటి పరీక్షలు జరిపేవారు. అవసరమైన రోగులకు కళ్ళద్దాలు సైతం ఉచితంగా ఇచ్చేవారు.

ఈ విధంగా నవంబరు 10, 2019 సం॥ వరకు బేర్ హాస్పిటల్‌కు అలుపెరగని నిస్వార్థ సేవలను అందించిన డా॥ లలితా చిక్కాలగారు నవంబరు 11వ తేదీన ఛాతిలో తీవ్రమైన నొప్పితోను, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితోను బాధపడుతుండగా వారిని సి.యం.సి. వెల్లూరుకు తీసుకు వెళ్ళగా, ఆంజియోగ్రామ్ పరీక్షను చేసి, మరుసటి రోజు వారి గుండెకు మూడు స్టెంట్లు వేయడమైనది. ఊపిరితిత్తుల వైద్య నిపుణుల పర్యవేక్షణలో సుమారు రెండు వారాలపాటు చికిత్స కొనసాగింపబడిన మీదట నవంబరు 24వ తేదీ రాత్రి గం.11.35 ని॥లకు 'నా యొద్దకు రమ్ము, అక్కడ ఉండవద్దు' ఆది.45:9 అన్న ప్రభువు పిలుపును అందుకొని, నిస్వార్థ, త్యాగపూరితమైన జీవితాన్ని వారసత్వంగా మిగిల్చి, 'తాను సేవచేయు దినములు సంపూర్ణమైనప్పుడు తన యింటికి వెళ్ళెను' లూకా 1:23 అను వాక్య ప్రకారం ప్రభువు మహిమలోకి ప్రవేశించారు.

25-11-2019న వారి పార్థివదేహం అంబులెన్స్‌లో చీరాలకు తరలించబడినది. 26-11-2019న జరిగిన వారి అంతిమయాత్ర మరియు భూస్థాపన కార్యక్రమమునకు ఎందరో ప్రముఖ వైద్యులు, చీరాల పురప్రముఖులు, చీరాల పరిసర ప్రాంత ప్రజలు హాజరై డా॥ లలితా చిక్కాలగారికి అంతిమనివాళి అర్పించారు. దైవసేవకులంటే ఎంతో ప్రేమ, అభిమానము, గౌరవము కలిగిన డా॥ లలితా చిక్కాలగారు బేర్ క్రిస్టియన్ హాస్పిటల్‌నందు ఎందరో సంఘ కాపరులకు సువార్త పరిచారకులకు ఉచితంగా వైద్యసేవలు అందించిన విషయాన్ని జ్ఞప్తి చేసుకుంటూ దైవసేవకులు ఎందరో వారి అంతిమయాత్రలో పాల్గొన్నారు. వారి మనుమ సంతానంలో వైద్య విద్యను అభ్యసిస్తూ ఉన్న ముగ్గురు పిల్లలు తామంతా డా॥ లలితా చిక్కాలగారి అడుగుజాడలలో నడుస్తూ, బేర్ క్రిస్టియన్ హాస్పిటల్ అభివృద్ధికి తమ వంతు సేవలు చేస్తామని వాగ్దానం చేశారు.

రోగులకు వైద్యచికిత్స చేయటంలో ప్రభువు ప్రేమను కనపరుస్తూ రోగ నివారణకై అలుపెరగని అవిశ్రాంత పోరాటంచేసి బేర్ క్రిస్టియన్ హాస్పిటల్ ఉన్నతిని కాంక్షించిన ఒక **'మహా దార్శనికురాలు'** అయిన డా॥ లలితా చిక్కాల గారి గురించి 'నిజమే వారు తమ ప్రయాసమును మాని విశ్రాంతి పొందుదురు వారి క్రియలు వారి వెంట పోవునని ఆత్మ చెప్పుచున్నాడు' ఆమేన్ (ప్రకటన 14:13).

## ప్రార్థనా విన్నపము

డా॥ ఫ్రెడ్రిక్‌గారు తన సతీమణిగారైన లలితా చిక్కాలగారి జ్ఞాపకార్థం **'డాక్టర్ లలితా చిక్కాల మెమోరియల్ నర్సింగ్ కాలేజీ'**ని బేర్ క్రిస్టియన్ హాస్పిటల్ ప్రాంగణంలో స్థాపించుటకు పూనుకొని యున్నారు. పేద ప్రజలకు వైద్యమును ఉచితంగా అందించే ఉద్దేశ్యంతో డా॥ ఫ్రెడ్రిక్‌గారు 90 సం॥ల వయస్సులో కూడా ఎంతో ప్రయాసపడుతున్నారు. కాబట్టి ప్రభుత్వం వారి నుండి రావలసిన అనుమతి త్వరగా వచ్చునట్లు మనవంతు బాధ్యతగా పత్రిక చదివే ప్రతిఒక్కరూ ప్రార్థించగలరని కోరుతున్నాను. దేవుడు మిమ్మును మీ కుటుంబాన్ని దీవించును గాక!

# కృపాదానం

చివరికి ఇంటర్వ్యూ కోసం కాగితాలు వచ్చాయి. జోసఫ్‌కి పట్టలేని సంతోషం కలిగింది. తండ్రి దగ్గరకి వెళ్ళి కాగితాలు చూపించాడు. ఆ కాగితాలు తీసుకొని కృపాదానంగారు ప్రార్థన చేశారు. ఆ ప్రార్థన ఇంటర్వ్యూ కొరకు కాదుగాని ఉద్యోగం వచ్చినట్లు ప్రార్థన చేశాడు. అదేంటి? ఉద్యోగం రాకముందే వచ్చినట్లు ప్రార్థించారు అంటే, ఉద్యోగం ఇవ్వటానికే ప్రభువు ఇంటర్వ్యూ కాగితం పంపించాడు అన్నాడు విశ్వాసంతో.

జోసఫ్ తండ్రి దగ్గర ప్రార్థన చేయించుకొని వెళ్ళాడు. ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలకు సరైన జవాబులు చెప్పలేదు. యూరప్ దేశాల పేర్లు రెండు చెప్పమంటే ఇంగ్లాండ్, అమెరికా అని చెప్పాడు. బయటకు వచ్చిన తర్వాత అవి యూరప్‌లోని దేశాలు కావని తెలుసుకొని, అంతేకాక తన జవాబు విని ఆఫీసర్ ఏ విధంగా రెస్పాండ్ అయ్యాడో తలచు కుంటే తనకు ఉద్యోగం రాదని అర్థమైంది. ఇంటర్వ్యూ నుంచి వచ్చిన తర్వాత ఉద్యోగం కొరకు ఆశలు వదులుకొని ఒరిస్సా వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు జోసఫ్. కాని ఇంట్లో ఎవరికి చెప్పలేదు.

రెండు వారాలైన తర్వాత హుబ్లీ డివిజన్‌లో కమర్షియల్ క్లర్కు ట్రైనింగ్‌కి రావాలనీ కాల్ లెటర్ వచ్చింది. అడ్రస్ కరెక్టేనా? కాదా? ఆ లెటర్ తన కొరకేనా? కాదా? అని ఉత్తరాన్ని నిశితంగా పరిశీలించిన మీదట, ట్రైనింగ్ కాల్ లెటర్ తనదే అని తెలుసుకొని ఆశ్చర్యపోయాడు జోసఫ్.

కృపాదానంగారికి ఆ లెటర్ చూపిస్తే ప్రార్థన ఎంతటి కార్యములోనైనా జయమిస్తుంది అన్నాడు.

1957లో రామాయపట్నం బాప్టిస్టు థియోలాజికల్ సెమినరీలో జి.టి.హెచ్. ముగించుకొని స్వగ్రామమైన ఒంగోలు వచ్చిన కృపాదానంకి స్థానిక మిషనెరీలతో సరియైన సంబంధాలు లేక బాప్టిస్టు సంఘములలో పాస్టరుగా పని దొరకలేదు. అందువలన మద్రాసులోని ది బెస్ట్ అండ్ కంపెని వారి సరకు పంపిణి దారునిగా ఉద్యోగంలో చేరాడు. ఆంధ్రప్రదేశ్ మొత్తానికి కృపాదానం గారే పంపిణిదారు. ఉద్యోగంలో భాగంగా కారు, కారు నడుపుటకు ఒక డ్రైవర్‌ను ఏర్పాటు చేశారు కంపెని వారు. అది మంచి ఆదాయం కలిగిన ఉద్యోగం. ఆ విధంగా ఒక సంవత్సరం అంతా కారులో తిరుగుతూ చేసే ఉద్యోగం చూసి అందరూ చాలా వ్యసనపడ్డారు.

అంత మంచి ఉద్యోగంలో ఉన్నప్పటికి కృపాదానం హృదయం భారంతో ఉండేది. అదేమంటే ఇప్పుడు తను బెస్ట్ అండ్ కంపెనీలో పనిచేసి ఊరు ఊరులు తిరిగి కంపెనీ వారి గురించి గొప్పగా చెబుతున్నందుకు కంపెనీ వారు దండిగానే ఇస్తున్నారు. ఇంతే ఆసక్తితో సువార్త పని చేస్తే దేవుడు ఇవ్వడా? అనే వేదన ఉండేది.

తన హృదయంలోని వేదనను తన భార్యతో పంచు కోగా ఆమె ఇంకా సంతోషించింది. ఇద్దరు కలసి సేవ చేయాలనే కృపాదానం కోరికను ఆమె స్వాగతించింది.

ఒంగోలు బాప్టిస్టు పెద్ద చర్చి పాస్టరు సాధుగారు రిటైరైతే కృపాదానంగారిచే ప్రతి ఆదివారం వాక్యం చెప్పించారు కాని పాస్టరుగా చేయనివ్వలేదు.

అప్పటికి కృపాదానం గారికి పదిమంది సంతానం వీరందరికి రోజుకు ఎన్ని బియ్యం కావాలి? విశ్వాసం సరి పోలేదు. ప్రతిరోజు విశ్వాసం ఇమ్మని ప్రార్థించేవాడు. ఒక సంవత్సరం గడచిపోయింది.

ఒకరోజు మద్రాసు వెళ్ళి కంపెని కారులో ఆంధ్రాకి బయలుదేరాడు. డ్రైవర్ కృపాదానం ఇద్దరే కారులో ఉన్నారు. గుమ్మళంపూడి అనే ఊరు దాటిన తర్వాత దగ్గర దగ్గరగా ఉన్నమూడు మర్రిచెట్లను దాటుతుంటే ప్రభువు కృపాదానం! అని పిలిచాడు. నా సేవ చెయ్యి అనే మాటలు స్పష్టంగా విన్నాడు. డ్రైవర్‌ని కారు ఆపమని చెప్పి కారు వెనక్కి తిప్పి ఆ మర్రిచెట్టు దగ్గరకు వచ్చిన తర్వాత మధ్యలోనున్న మర్రిచెట్టు వద్దకు వెళ్ళి మోకరించి ప్రార్థించాడు. కారులో వెనక్కి మద్రాసు వెళ్ళి కారు కంపెనీ వారికి అప్పజెప్పి, తన ఉద్యోగానికి స్వస్తి చెప్పి వారితో దేవుని స్వరము విన్నానని చెప్పి రైలులో ఒంగోలు వచ్చాడు.

స్త్రీల విభాగం

# మరియ

హన్నాకృప పాఠకులకు యేసుక్రీస్తు వారి ప్రశస్త నామములో క్రిస్మస్ శుభాకాంక్షలు.

మనం క్రిస్మస్ జరుపుకొనుటకు క్రీస్తు ఈ భూమ్మీద రావడం కారణమైతే ఆ క్రీస్తును భూమ్మీద తెచ్చుటలో ప్రధానపాత్ర పోషించిన స్త్రీ మూర్తి మరియ. అంత గొప్ప దేవుని దయాసంకల్పమును నెరవేర్చుటలో భాగమైన మరియ జీవితం మనకు ఆదర్శప్రాయం.అటువంటి స్త్రీమూర్తి లోని గుణగణాలను ఈ సంచికలో ధ్యానిద్దాం.

మానవాళిని తమ పాపాల నుండి రక్షించుటకు యేసుక్రీస్తును ఈ భూమ్మీద పుట్టించుట అనేది గొప్ప దైవ కార్యం, దేవుని అనాది సంకల్పం. అటువంటి కార్యములో భాగమవ్వడం ఒక ధన్యత. అటువంటి ధన్యతను పొందు కున్న మరియ ఎటువంటి సుగుణాలను కలిగి ఉన్నదో, ఆమె భక్తిజీవతం ఎంత నిష్ఠగలదై ఉండి ఉంటుందో మనం ఊహించవచ్చు. వాటిలో కొన్ని అంశాలు.

**దయాప్రాప్తురాలు:** మరియ దయాప్రాప్తురాలు. అంటే దయను పొందుకున్నది అని అర్థం. ఎవరి దయను పొందుకుంది అంటే దేవుని దయను పొందుకున్నది. *"ఆ దూత లోపలికి వచ్చి ఆమెను చూచి దయాప్రాప్తురాలా నీకు శుభము" లూకా 1:28.* దేవుని సముఖమందు నిలుచు దూతయైన గబ్రియేలు మరియతో చెప్పిన మాటేమిటంటే – మరియ నీవు దయపొందావు నీకు శుభము జరుగుతుంది. దేవుని దయ కొరకు అందరూ ఎదురుచూస్తారు కాని కొందరే ఆయన దయను పొందగలరు. దేవుని దయను పొందుకొన్న మరియ **శుద్ధహృదయము** కలది. *"శుద్ధ హృదయుల యెడల నిశ్చయముగా దేవుడు దయాళుడై ఉన్నాడు" కీర్తన 73:1.* అంతేకాదు మరియ **సుబుద్ధి** కలది అని చెప్పవచ్చు *"సుబుద్ధి దయను సంపాదించును" సామెతలు 13:15* మరియ **దయగలది.** *"దయగలవారి యెడల నీవు దయ చూపించుదవు" కీర్తన 18:25, 2సమూ22:26.* మరియ **ఇచ్చే స్వభావము** కలది. *"దయాదృష్టిగలవాడు తన ఆహారములో కొంత దరిద్రునికిచ్చును" సామెతలు 22:9 "పుచ్చుకొనుట కంటె ఇచ్చుట ధన్యము" అపొ.కా 20:35* మరియ **దేవునిపై ఆధారపడు స్త్రీ** *"తన్ను ఆశ్రయించువారి యెడల యెహోవా దయాళుడు, తన్ను వెదకు వారియెడల ఆయన దయచూపువాడు" విలాప 3:25*

పై వాక్యాల ఆధారంగా మరియ దయ, సుబుద్ధి, శుద్ధ హృదయము అను గుణములను కలిగి ఉన్నది అనవచ్చు. అంతేకాదు ఇతరులకు ఇచ్చే స్వభావం కలది. అన్నింటికంటే ముఖ్యంగా దేవునిపై ఆదారపడే స్త్రీ. అంటే తన కష్టములో, ఇబ్బందులలో నరులను ఆశ్రయించక, వారి సహాయము ఆశించక దేవుని ఆశ్రయించు స్త్రీ. తన హృదయంలో దేవుని వెదుకునది. దేవుని ధ్యానించునది. దేవుడు మెచ్చే ఈ గుణములు కలిగి ఉన్నందున మరియ దేవుని దయను పొందుకొని దయాప్రాప్తురాలు అయ్యింది.

**ప్రభువు తోడైయున్నాడు:** గబ్రియేలు దూత మరియతో చెప్పిన రెండవమాట *"ప్రభువు నీకు తోడైయున్నాడు" లూకా 1:28.* దేవుని తోడు ఎవరికి లభిస్తుందని వాక్యము చెప్తుందటే యథార్థవంతులకు. అంటే మరియ **యథార్థ వంతురాలు** అని చెప్పవచ్చును. *"యథార్థవంతులకు ఆయన తోడుగా నుండును" సామెతలు 3:32.*

**ఆశీర్వదింపబడిన స్త్రీ:** ఎలీసబెతు పరిశుద్ధాత్మతో నిండుకొనినదై మరియ గురించి సాక్ష్యమిచ్చిన మాటలు మనం పరిశీలిద్దాం *"స్త్రీలలో నీవు ఆశీర్వదింపబడినదానవు" లూకా 1:42.* దేవుడు ఎవరిని ఆశీర్వదిస్తాడని వాక్యం సెలవిస్తుందంటే *"పిన్నలనేమి పెద్దలనేమి తనయందు భయభక్తులు గలవారిని యెహోవా ఆశీర్వదించును" కీర్తన 115:13* ఈ వాక్యాధారంగా మరియ **దేవునియందు భయభక్తులు** కలది అని చెప్పవచ్చు.

దేవునియందు భయభక్తులు గలవారికి కలుగు మేలులు గురించి, వారి ప్రవర్తన గురించి బైబిల్ గ్రంథమంతా వ్రాయ బడిఉంది. మచ్చుకకు *"యెహోవాయందు భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడబడును" సామెతలు 31:30.*

*"నీ గర్భఫలమును ఆశీర్వదింపబడును" లూకా 1:42*

పై మాటలు ఎలీసబెతు స్వంతంగా పలికినవి కాదు. ఆమె ద్వారా పరిశుద్ధాత్మ పలికించినవి. అంటే దేవుడు మరియ గర్భఫలమును ఆశీర్వదించాడు.

**ధన్యురాలు:** *"ప్రభువు ఆమెకు తెలియజేయించిన మాటలు సిద్ధించును గనుక నమ్మిన ఆమె ధన్యురాలు" లూకా 1:45*

ఈ వాక్యమును జాగ్రత్తగా గమనించినట్లయితే మరియకు గబ్రియేలు దూత ద్వారా తెలియజేయబడిన మాటలు భవిష్యత్తులో జరగబోయేవి. పైగా ఆమె ఉన్న స్థితికి, మానవ మేధస్సుకు అవన్నీ అసంభవాలు అయినా ప్రభువు చెప్పాడు కాబట్టి మానవ విచక్షణకు అతీతమైన దేవుని శక్తిని నమ్మింది కాబట్టి మరియ ధన్యురాలు అయ్యింది. పరిశుద్ధాత్మ ద్వారా గర్భము ధరించుట, దానిని నమ్ముట అనేది మరియకు దేవునిపై ఉన్న విశ్వాసస్థాయిని తెలియజేస్తున్నది. *"యెహోవాయందు భయభక్తులు కలిగి ఆయన త్రోవల యందు నడుచువారందరు ధన్యులు" కీర్తనలు 128:1*

*"తనయందు భయభక్తులు గలవారియందు తన కృప కొరకు కనిపెట్టువారియందు యెహోవా ఆనందించు వాడైయున్నాడు" కీర్తన 147:11*

పైన పేర్కొనబడిన వాక్యాలను మరికొంత నిశితంగా పరిశీలించినట్లయితే మరియ భక్తిజీవితం మనకు అవగత మౌతుంది. మరియ దేవుని దయను పొందుకోవడానికి ఆమె సుగుణాలు కారణమైతే ఆ సుగుణాలు పొందుటకు ఆధారం ఆమె భక్తిజీవితం. దేవుని యందు ఆమెకున్న భయభక్తులు ఆమెను సుగుణాల రాశిగా తీర్చిదిద్దాయి. ఫలితంగా చరిత్రలోనే కాక పరిశుద్ధ గ్రంథంలో ఒక అత్యున్నతమైన స్థాయిని పొందుకున్న ధన్యజీవి మరియ.

"కాగా దేవునిచేత ఏర్పరచబడినవారును పరిశుద్ధులును ప్రియులైనవారికి తగినట్లు, మీరు జాలిగల మనస్సును, దయాళత్వమును, వినయమును, సాత్వికమును, దీర్ఘశాంత మును ధరించుకొనుడి" కొలొస్స 3:12

క్రైస్తవ స్త్రీలుగా మనం కూడ మరియవలె దేవునియందు భయభక్తులు కలిగి జీవించి, తగు అభ్యాసము ద్వారా దేవుడు మెచ్చే సుగుణాలను పొందుకొందాం! మరియ వలె దేవుని చిత్తాన్ని నెరవేర్చుటలో పాలిభాగస్తులమౌదాం! అట్టి కృప దేవుడు మనకందరికి అనుగ్రహించును గాక!


## కొడవటికంటిగారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. 40 |
| 2. | ఆసెనతు | రూ. 150 |
| 3. | అపొస్తలుడు | రూ. 250 |
| 4. | నా చిత్తానుసారుడు | రూ. 110 |
| 5. | గుంట నుండి మింటికి | రూ. 50 |
| 6. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. 60 |
| 7. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. 65 |
| 8. | తోటలో పనివాడు | రూ. 20 |
| 9. | గోత్రకర్త (యాకోబు) | రూ. 50 |
| 10. | నా కుటుంబము | రూ. 25 |
| 11. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. 50 |
| 12. | నా కుమారి (రూతు) | రూ. 60 |
| 13. | నా స్నేహితుడు | రూ. 50 |
| 14. | అంత్యదినములలోని యథార్థ ప్రవక్త | రూ. 50 |
| 15. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. 65 |
| 16. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. 65 |
| 17. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. 65 |
| 18. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. 65 |
| 19. | సువార్తలలోని యేసుకథ | రూ. 75 |
| 20. | యేసుకథ రెండవ భాగం | రూ. 75 |
| 21. | యేసుకథ మూడవ భాగం | రూ. 75 |
| 22. | జీవనమంతయు | రూ. 40 |
| 23. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. 65 |
| 24. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. 65 |
| 25. | ఓ చినుకునవుతా... | రూ. 30 |
| 26. | మిక్కిలి సాత్వికుడు | రూ. 150 |
| 27. | విశ్వాసము విజయము-1 | రూ. 70 |
| 28. | విశ్వాసము విజయము-2 | రూ. 70 |
| 29. | విశ్వాసము విజయము-3 | రూ. 70 |
| 30. | హదస్సా | రూ. 70 |
| 31. | మిక్కిలి సాత్వికుడు | రూ. 150 |

పుస్తకములు కావలసినవారు :
రెవ. డా॥ కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర
కృపాదానంగారివీధి, క్లౌపేట, 6వ లైను
ఒంగోలు-523001
ప్రకాశం జిల్లా, ఫోన్ : 9440217726

చిన్నపిల్లల పేజి

# సమయము

ఆదివారం జాన్ త్వరగా నిద్ర లేవడం చూసి ఆశ్చర్య పోయింది తల్లి మెర్సీ. ఎంటబ్బా రోజు పది సార్లు లేపితే గాని లేవడు, ఏమైంది వీడికి? అందులోను ఈ రోజు ఆదివారం. స్కూల్‌కి వెళ్ళవలసిన పని లేదు. సండేస్కూల్ కొరకు ఏమైనా సిద్ధపడడానికి లేచాడా? మెర్సీ మనసులో కొంచెం సంతోషం కలిగినా అనుమానం తీరక హాల్‌లోకి తొంగి చూసింది. కలిగిన కాస్త సంతోషం ఆవిరైపోయింది. జాన్ హాల్‌లో టివి చూస్తున్నాడు.

జాన్ అల్లరి పిల్లవాడు కాదు కానీ దేవుని పట్ల, చర్చి విషయాలలో అంత శ్రద్ధ చూపడు. తల్లి బలవంతం మీద చర్చికి, సండేస్కూల్‌కి వెళ్ళి రావడం చేసేవాడు. సండే స్కూల్‌లో చెప్పిన కంఠత వాక్యాలు అన్ని చక్కగా నేర్చుకునే వాడు కాని దేవుని పట్ల భయభక్తులు లేవు. జాన్‌కి రెజ్లింగ్ అంటే ఆసక్తి. వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్ మ్యాచెస్‌ను ఇష్టంగా చూసేవాడు. అందులోను జాన్‌సీనా అనే ఆటగాడు అంటే జాన్‌కు అమితమైన ఇష్టం. అతని మ్యాచెస్ ఏవి మిస్ అవ్వకుండ చూసేవాడు. రెజ్లింగ్ అంటే ఆసక్తి కలిగి ఉండటం తప్పు కాదు కానీ దేవుని పట్ల ఆసక్తి చూపని జాన్ ప్రవర్తనను గమనించిన మెర్సీ అనుదినం కొడుకు మారు మనస్సు కొరకు భారంతో ప్రార్థించేది.

“జాన్ చర్చి టైం అవుతున్నా ఇంకా టి.వి చూస్తున్నావ్? లే, లేచి రెడీ అవ్వు” అంది కాస్త కటువుగా. “మమ్మీ ఇంకో టెన్ మినిట్స్ మ్యాచ్ లాస్ట్‌లో ఉంది ఎవరు విన్ అవుతారో” అన్నాడు జాన్. “మాట అంటే లెక్క లేదా? ముందు టి.వి ఆఫ్ చేసి లేచి రెడీ అవ్వు. ఏదో పెద్ద పని ఉన్నట్లు ఆరు గంటలకే లేచి టివి చూస్తున్నావ్” అంది కోపంగా మెర్సీ. “ప్లీజ్ మమ్మీ ఇంకో పది నిమిషాలే. ప్లీజ్ ప్లీజ్ జాన్‌సీనా మ్యాచ్ వస్తుంది. ఈ మ్యాచ్ అవ్వగానే ఆపేస్తాను. అయినా చర్చి ఎప్పుడో పది గంటలకు కదా. ఆ సమయానికి రెడీ అవుతాను. సండేనే కదా ఈ రోజు కూడా టివి చూడకపోతే ఇంకెందుకు సండే” అన్నాడు జాన్ కాస్త వాదిస్తున్నట్లుగా. కొడుకుతో వాదించడం ఇష్టం లేక “తొమ్మిదిన్నర లోపు నువ్వు స్నానం చేసి, టిఫిన్ తిని చర్చికి సిద్ధపడి ఉండాలి” అన్నది తల్లి. చర్చి పది గంటలకు కదా 30 నిమిషాల ముందే సిద్ధ పడటం దేనికి అన్నట్లు తల్లి వైపు చూశాడు కానీ తల్లి కోపంగా ఉండటం గమనించి నోరు తెరవడానికి ధైర్యం చేయలేదు జాన్.

క్రిసమస్ సమయం కావడంతో చర్చిని చక్కగా అలంక రించారు. క్రిసమస్‌ట్రీ ప్రత్యేక ఆకర్షణగా అలంకరింప బడింది. క్రిస్‌మస్ ఇంకా పది దినములు ఉన్నప్పటికి ఆ రోజే క్రిస్‌మస్ అన్నట్లు ఉంది చర్చి వాతావరణం. చర్చి లోను, సండేస్కూల్‌లోను క్రీస్తు పుట్టుకను గూర్చిన అంశాలే చెప్పబడ్డాయి.

మధ్యాహ్నం భోజన సమయంలో మెర్సీ జాన్‌తో “మీ డాడీ రేపు వస్తున్నారు” అంది. “అవునా మమ్మీ” సంతోషంతో జాన్ కళ్ళు మెరిశాయి. అవును అన్నట్లు తలూపింది మెర్సీ కొడుకు కళ్ళలోని సంతోషాన్ని గమనిస్తూ. డాడీ వస్తే ఎంచక్క ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు పైగా మమ్మీ చెప్పే దేవుడు చర్చి గోల కూడ తప్పిద్ది అనుకున్నాడు జాన్ మనసులో.

జాన్ తండ్రి జోసఫ్ ఒక నేవీ ఆఫీసర్. ఉద్యోగ రిత్యా సముద్ర ప్రయణాలు చేయడం వలన ఎన్నో క్రొత్త క్రొత్త సంగతులు, వింతలు విశేషాలు, క్రొత్త ప్రదేశాలు అక్కడి నాగరికతలు వారి ఆచార వ్యవహారాల గురించిన ఎన్నో క్రొత్త విషయాలు చెప్తుంటాడు అందుకే జాన్‌కి తండ్రితో సమయం గడపడం అంటే ఎంతో ఇష్టం.

ఊహించినట్లే జోసఫ్ రావడం, పండగ నిమిత్తం షాపింగ్‌లు సెలబ్రేషన్స్ అన్ని జరిగాయి. అన్ని రోజులు ఉత్సాహంగా గడిచాయి. క్రిస్‌మస్ కానుకగా జోసఫ్ తాను తెచ్చిన క్రిస్‌మస్ బహుమానాన్ని జాన్‌కి ఇచ్చాడు.

ఆ బాక్స్‌ను తెరచి చూడగానే ఎగిరి గంతేశాడు జాన్

ఎందుకంటే అదొక ప్లేస్టేషన్. సరికొత్త వీడియోగేమ్. అందులోను ఐదుగురు రెజ్లింగ్ స్టార్స్‌ను ఎన్నుకుని గేమ్ ఆడవచ్చు. జాన్ ఆనందానికి హద్దులు లేవు. పెద్దగా అరుస్తు తండ్రిని పెనవేసుకొని “థ్యాంక్స్ డాడ్” అన్నాడు. “గిఫ్ట్ నచ్చిందా” అడిగాడు తండ్రి. “నచ్చింది నా లైఫ్‌లో బెస్ట్ గిఫ్ట్ డాడీ” అంటూ వీడియోగేమ్‌ను ఆడటానికి సిద్ధపడు తున్నాడు జాన్. తన కానుక కొడుకుకు నచ్చడంతో జాన్ కంటే ఎక్కువ సంతోషించిన జోసఫ్ తన సంతోషాన్ని పంచు కోడానికి భార్య వైపు చూశాడు. ఆమె ముఖంలో మచ్చుకకు కూడ సంతోషం లేకపోగా కలవరం కనపడింది జోసఫ్‌కు.

“ఏమైంది? జాన్‌కు ఇచ్చిన గిఫ్ట్ నచ్చలేదా?” అడిగాడు జోసఫ్ మెర్సీని. “మామూలుగానే వాడికి రెజ్లింగ్ అంటే పిచ్చి. కాస్త సమయం దొరికితే చాలు టివిలో డబ్ల్యుడబ్ల్యు యి మ్యాచెస్ చూస్తుంటాడు. దేవుడంటే అస్సలు భయభక్తులు లేవు. కోతికి కొబ్బరిచిప్ప ఇచ్చినట్లు మీరిప్పుడు ఈ వీడియో గేమ్ తెచ్చిచ్చారు. వాడిని దేవుని వైపుకు ఎలా నడిపించాలో నాకు అర్థం కావడం లేదు” అన్నది ఆందోళనతో. “అదేంటి? జాన్ రోజు కుటుంబ ప్రార్థనలో పాల్గొంటున్నాడు కదా, జాన్ గురించి ఏమైనా ఫిర్యాదులు అందాయా?” అడిగాడు జోసఫ్. “జాన్ ప్రవర్తన గురించి ఎటువంటి ఫిర్యాదులు లేవు కాని వాడికి దేవుడంటే ఆసక్తి లేదు ఆచార ప్రకారం ప్రార్థనలో పాల్గొనడమే తప్ప ఆసక్తి చూపడు” అంది మెర్సీ. పరిస్థితి తనకు అర్థమైన్నట్లు తలూపి జాన్‌తో నేను మాట్లాడ తాను అన్నాడు జోసఫ్.

మరునాడు సాయంత్రం టివి చూస్తున్న జాన్‌ను గమ నించిన తండ్రి, “ఏంటి జాన్ ఏమి చూస్తున్నావ్?” అని అడిగాడు. “చూడు డాడీ డబ్ల్యుడబ్ల్యుయి సూపర్‌స్టార్ జాన్‌సీనా తన క్రిస్మస్‌ను ఒక పేద అబ్బాయితో జరుపు కున్నాడు. ఎంత గ్రేట్ కదా. ఆ అబ్బాయి ఎంత లక్కీనో కదా” అన్నాడు ఆశ్చర్యంతో కూడిన స్వరంతో.

“ఆ పిల్లవాడే కాదు నువ్వు కూడా లక్కీ ఫెలో అవ్వచ్చు” అన్నాడు తండ్రి చిరునవ్వు నవ్వుతూ. “నేను లక్కీనా అంటే జాన్‌సీనా మనింటికి వస్తున్నాడా డాడీ” అడిగాడు జాన్ ఆతృతతో. “కాదు జాన్, జాన్‌సీనా కంటే, ఈ ప్రపంచంలో అందరి కంటే గొప్పవాడైన యేసయ్య నీతో క్రిస్‌మస్ జరుపు కోవాలని ఆశిస్తున్నాడు, కానీ నువ్వు ఆ పిల్లవానివలె వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోక నీ కొరకు వచ్చిన సూపర్‌స్టార్ యేసయ్యతో సమయాన్ని గడపక నీ పనుల్లో బిజీగా ఉన్నావు” అన్నాడు తండ్రి.

“అదేంటి డాడీ నేను చర్చికి వెళ్ళాను కదా” అన్నాడు జాన్ చిరుకోపంతో. “జాన్‌సీనా వచ్చినప్పుడు ఆ పిల్లవాడు అతనితో మాట్లాడక రేపు నేను వచ్చి నీ మ్యాచ్ చూస్తాను అంటే జాన్‌సీనా సంతోషిస్తాడా? చెప్పు” అన్నాడు తండ్రి. లేదు అన్నట్లు అడ్డంగా తలూపి మౌనం వహించాడు జాన్.

“నువ్వు చెప్పేది అలా ఉంది. యేసయ్య పరలోకంలో ఆనందంగా ఉండక మన కొరకు, మనలను సంతోష పెట్టుటకు, మనలను పరలోకం తీసుకెళ్ళాలని మానవునిగా భూమ్మీదకు వచ్చి, మన కొరకు తన ప్రాణాన్ని అర్పించి మరణంపై విజయం సాధించి సజీవుడయ్యాడు. అందుకే ఆయన పుట్టినరోజైన క్రిస్మస్ పర్వదినం అయ్యింది. అయితే మన కొరకు తన జీవితాన్నే ఇచ్చిన యేసయ్యను, మన హృదయమనే ఇంటిలోనికి ఆహ్వానించి ఆయనతో సమయం గడపాలి. అందుకు ఇష్టపడాలి. నిజమైన ధన్యత అదే. అర్థమైందా?” జాన్ అడిగాడు తండ్రి. అర్థమైందనట్లు తలూపాడు జాన్.

జాన్ యేసును తన స్వంత రక్షకునిగా అంగీకరించి నిజమైన క్రిస్మస్‌ను జరుపుకున్నాడు. తన సమయాన్ని సద్వినియోగం చేయదలచి తన ప్లేస్టేషన్‌ను అటకెక్కించిన జాన్‌కు ఒక క్రొత్త బైబిల్ గ్రంథాన్ని బహుమానంగా ఇచ్చాడు తండ్రి. దాన్ని తెరచి చూచిన జాన్ ఆశ్చర్యపోయాడు అందులో జాన్‌సీనాను కలుసుకునే అవకాశం కల్పించే ఎన్‌రోల్‌మెంట్ అప్లికేషన్ ఉంది. జాన్ ఆ అప్లికేషన్‌ను తీసి చెత్తబుట్టలో వేసి బైబిల్‌ను హత్తుకొని “ఇదే నా బెస్ట్ క్రిస్మస్ గిఫ్ట్ ఎందుకంటే అందరికంటే గొప్పవాడైన దేవుని కలుసు కొనుటకు ఇది నడిపిస్తుంది అని తెలుసుకున్నాను అన్నాడు తండ్రితో.

# పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక -17

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | | 5 | | | 6 |
| ■ | | | ■ | ■ | | 7 | ■ | |
| ■ | | | 8 | | | | 9 | |
| 10 | | | 11 | | | | | |
| ■ | | ■ | | 12 | ■ | ■ | | |
| 13 | | 14 | | | 15 | 16 | | |
| | ■ | | | | | ■ | | |
| 17 | | | ■ | | 18 | | | |
| | ■ | 19 | | | 20 | | | |

**అడ్డం:**

1. క్రిస్మస్ ఎవరి జన్మదిన వేడుక (2)
4. మరియ బంధువురాలు (5) (లూకా)
8. మరియ గర్భం ధరించుటకు కారణమైంది తిరగబడింది (5)(లూకా)
10. మనకు అనుగ్రహింపబడిన అధిపతి(6) (యెషయా 9)
11. మరియ స్వస్థలం(4) (మత్తయి)
12. నేను దావీదునకు ----- పుట్టించెదను (5) (యిర్మీయా 23)
13. యోసేపు ఈ ఊరివాడు (4) (లూకా)
14. యోసేపు వంశం (4) (నిర్గమ.)
15. తారుమారైన అబీయా తరగతి యాజకుడు (3) (లూకా)
16. దూత---నందు యోసేపునకు ప్రత్యక్షమాయెను (2) (మత్తయి)
17. యూదా రాజు(3) (మత్తయి)
18. ప్రభువు చూపు సూచనలో గర్భవతియగునది (3) (యెషయా 7)
19. రోమా చక్రవర్తి (3) (లూకా)
20. యేసు అను మాటకు అర్థం (4) (మత్తయి)

**నిలువు:**

2. గొఱ్ఱెల కాపరులకు చెప్పబడిన మంచి వార్త (లూకా) (6)
3. యేసు తండ్రి (3) (లూకా)
4. అహంకారుల -----ను మాన్పించెదను (5) (యెషయా) (తలక్రిందులైంది)
5. మరియ యోసేపులకు ఇక్కడ స్థలము దొరకలేదు (2) (లూకా)
6. యేసుకు ఇవ్వబడిన పేర్లలో ఒకటి (9) (యెషయా 9)
7. దయాప్రాప్తురాలు (3) (లూకా)
9. యేసు జన్మస్థలం(6) (లూకా)

**పరిశుద్ధగ్రంథ పరిశోధన పట్టిక -16 జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 లు | 2 యు | స్కీ | 3 మ | ద | ■ | 4 ము | ■ | 5 తి |
| ■ | ట్ట | ■ | ల్ల | ■ | 6 త్న | య | ము | ప్ర |
| 7 తు | 8 యో | రీ | కె | ■ | ■ | శ | ■ | 9 అ |
| ■ | రై | ■ | 10 అ | 11 నా | తో | తి | యు | డు |
| 12 యో | ■ | 13 ర్మే | ■ | దా | ■ | అ | ■ | గు |
| 14 సు | బ్రో | హె | 15 లె | బు | 16 హ | ■ | 17 అ | ■ |
| ర్దా | ■ | తి | ■ | ■ | 18 నా | ర్బో | 19 హ | వ్వ |
| 20 ది | వా | ప | అ | ■ | దా | ■ | రో | ■ |
| న | ■ | ద్యు | ■ | ■ | 21 దు | ర్జ | ను | డు |

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 16**
**సరైన జవాబులు పంపించిన వారు**

1. డి. మెర్సీ ఇశ్రాయేల్, నెల్లూరు
2. కె. రూత్ ఇవాంజిలిన్, హైదరాబాద్
3. బి. ఆనీమేరి, హైదరాబాద్
4. టి. రాజకుమారి, విజయవాడ
5. కె. అనిత, రాజమండ్రి
6. బి. ఎస్తేరు, గుంటూరు
7. పి. శాంతాగ్రేస్, మచిలీపట్నం
8. బి. సువార్తరాజు, బెంగుళూరు